*Licensed to post with payment at RMS, Hyd*



## పిల్లలకు అశ్లీల చిత్రాలు చూపించడం.. బాలికలతో అసభ్య ప్రవర్తన చట్టరీత్యా నేరం


## UDBHAVA

Edited, Printed, Published and owned by **Dr. M. Madhava Vasu** and Printed at Saraswathi Printers, Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015. Telangana and Published at Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana.
Editor : Dr. M. Madhava Vasu,
RNI No: 87195 (APTEL/2005/14638)
Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com




తెలంగాణ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా సీతాదయాకర్‌రెడ్డి

# ఉద్భవ


స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

Volume : 19 Issue: 1 April 2025 Pages: 72 Rs.10




# మహిళలపై నేరాలకు పాల్పడితే ఇక ఉరిశిక్షే

మహిళా దినోత్సవ వేడుకలో ప్రధాని నరేంద్ర మోదీ

# ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం /
స్వేచ్ఛ / హక్కుల మాస పత్రిక

Regn. No. 87195 (APTEL/2005/14638)

**Volume:19 Issue: 1 * April 2025 * Pages: 72 Rs.10**

Founder and Editor in Chief

**Dr. M. Madhava Vasu**

M.A., M.H.R., M.Phil (JMC), P.G.H.R., Ph.D., F.D.R. (Nalsar), B.P.R., DEE.

**Advisors:**

**Sri M. Madhusudhan Reddy**
Advocate

**Sri P. Balreddy**
Advocate

**Sri S. Mohan Rao**
Journalist

Kakinada Correspondent :
**Sri D. Venugopal Rao**

## లోపలి పేజీల్లో...

- మహిళలపై నేరాలకు పాల్పడితే ఉరిశిక్షే 3
- మన ఆస్తులు ప్రకటిద్దాం 8
- రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు 10
- శిశు మరణాల నియంత్రణలో భారత్ భేష్ 11
- మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం 13
- చెన్నైలో మహిళలకు 100 పింక్ ఆటోలు 17
- బుల్డోజర్ న్యాయం అమానవీయం 20
- ఏడుగురి ఉసురు తీసిన నకిలీ కార్డియాలజిస్టు 42
- భారత్‌లోనే అత్యధిక కాలుష్య నగరాలు! 49
- మానవ అక్రమ రవాణాను ఛేదించిన ఎన్ఐఏ 60

**UDBHAVA**
Edited, Printed, Published and Owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com

**UDBHAVA**
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.

**DISCLAIMER**
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.

**ACKNOWLEDGEMENT OF THE SOURCE**
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

## సంపాదకీయం

# మహిళలకు భద్రత అసాధ్యమేమీ కాదు

కాలంతో పాటే నేరాల తీరూ మారుతోంది. వీటితోపాటే కఠిన చట్టాలూ వస్తున్నాయి. అయినా మనిషి మారడం లేదు. ఏదో ఒక రూపంలో, సరికొత్తగా, విచారణకు అంతుచిక్కని రీతిలో మహిళలపై నేరాలు జరిగిపోతున్నాయి. చట్టాలకు వెరవడం లేదు, శిక్షలు భయపెట్టడం లేదు. బాలికలనుంచి మధ్యవయసు దాటిన మహిళలకూ రక్షణ రోజురోజుకూ ప్రశ్నార్థకంగా మారుతోంది. మైనర్లను వదిలిపెట్టని మైనర్ల కేసులూ వెలుగుచూస్తున్నాయంటే ఆ తప్పు ఎవరిది? బాలుడిదా లేక తల్లిదండ్రులదా? లేక నట్టింట్లో నాట్యం చేస్తున్న ఇంటర్నెట్‌దా? లేక స్వేచ్ఛ నుంచి వచ్చిన విచ్చలవిడితనమా? ఎవర్ని అనాలి? ఎవరిని అడగాలి? ఆడబిడ్డకు జరిగిన అన్యాయాన్ని ఎలాంటి న్యాయంతో తిరిగి తీసుకురాగలరు? దోషులను శిక్షిస్తే న్యాయం జరిగినట్టేనా? మన దేశంలో ప్రాణ సమానంగా చూసుకునే మానానికి భంగం కలిగితే ఆ బిడ్డ సమాజంలో ఎలా తలెత్తుకు నిలబడుతుంది? హేళన చేసేవారు, రోత చూపుల నుంచి తన భావి జీవితాన్ని ఎలా నెట్టుకు రాగలుతుంది? పెళ్లయిన ప్రబుద్ధులు సైతం పక్కచూపులు చూసి అనైతిక బంధానికి వెంపర్లాడే కేసులూ.. మైనర్లే మైనర్ బాలికలను వేధిస్తున్న కేసులూ.. ఈ రెండు ఉదాహరణలనూ వేరువేరుగా చూడాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో నిత్యం ప్రసారమవుతున్న వెకిలి చేష్టలు భావి తరాలకు తప్పుగా అనిపించడం లేదు. ప్రస్తుత తరం - విలువలకు విలువ ఇస్తే... అదే లక్షణం తర్వాతి తరం అనుసరిస్తుందనేది అక్షర సత్యం. వయసును మరిచి, విలువలను వదిలేసి, ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో విచక్షణ కోల్పోయి, దాన్నే సమర్థించుకుని - సమాజంలో నిస్సిగ్గుగా నిలబడితే బరితెగింపు కాదా? అది భావి తరాలకు మార్గదర్శకం కాదా?

'మార్పు' రావాలంటే - ఎక్కడినుంచో రాదు. కొనుక్కుంటే వచ్చేది అంతకన్నా కాదు. అది ముందుగా ఇంటినుంచే ప్రారంభం కావాలి. దాని బీజం నట్టింట్లో దివిటీలా వెలగాలి. అప్పుడది పరిసరాలకు, సమాజానికి వెలుగును ప్రసాదిస్తుంది. మహిళలను గౌరవించాలనే విషయాన్ని మరిచిపోయిన సమాజాన్ని చురుక్కుమనిపించేలా చేస్తుంది. మేల్కొనేలా చేస్తుంది. ఇప్పటివరకూ చేస్తున్నది తప్పని తెలియజేస్తుంది. ప్రతి బాలికకు, మహిళకు రక్షణగా నిలుద్దామనే ఉన్నతమైన ఆలోచనకు నాంది పలుకుతుంది. ఆ క్షణమే మహిళల భవితకు, భద్రతకు నిజమైన రక్షణ ఛత్రం.

# మహిళలపై నేరాలకు పాల్పడితే ఉరిశిక్షే

## మహిళా దినోత్సవ సభలో ప్రధాని మోదీ



మహిళల భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారిపై జరిగే నేరాల కట్టడికి కఠిన చట్టాలు రూపొందించడంతోపాటు నియమ, నిబంధనలను కూడా కఠినతరం చేశామని ప్రధాని మోదీ వెల్లడించారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడడం సహా అమానుషాలకు ఒడిగట్టే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టాలను రూపొందించినట్టు తెలిపారు. బ్రిటీష్ కాలంనాటి ఐపీసీ సెక్షన్ స్థానంలో తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్).. మహిళలకు రక్షణ కవచంగా మారిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాలో ఉన్న వాంసి బోర్సి గ్రామంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో దేశం వేగవంతమైన పురోభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. “మహిళలపై అత్యాచారాలు, అమానుషాలకు పాల్పడేవారికి ఉరిశిక్ష విధించేలా మా ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చింది. బాధిత మహిళలకు సత్వర

న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. దేశవ్యాప్తంగా మరో 800 కోర్టులను ఏర్పాటు చేయనున్నాం. బీఎన్ఎస్‌లో మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఒక ప్రత్యేక అధ్యాయాన్ని జోడించాం" అని ప్రధాని వివరించారు. బాధితులకు సత్వర న్యాయం అందని ద్రాక్ష అనే మాట గతంలో వినిపించేదని, కానీ, నూతన చట్టాల ద్వారా దారుణమైన కేసుల్లో విచారణను 60 రోజుల్లోనే పూర్తి చేయాలని, 45 రోజుల్లోనే తీర్పులు వెలువరించాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిపారు. కొత్త చట్టాల ద్వారా దేశంలో ఎక్కడైనా 'ఈ-ఎఫఐఆర్' నమోదు చేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని, లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు.. జీరో ఎఫ్ఐఆర్‌లను ఎక్కడైనా నమోదు చేయొచ్చని తెలిపారు. అత్యాచార బాధితుల వాంగ్మూలాలను ఆడియో, వీడియో మాధ్యమాల్లో కూడా నమోదు చేయొచ్చని చెప్పారు.

ప్రపంచంలోనే తాను అధిక సంపన్నుడినని ప్రధాని మోదీ చమత్కరించారు. "ఔను! ప్రపంచంలోనే నేను అధిక సంపన్నుడిని. అయితే.. ధనం రూపంలో సంపన్నుడిని కాదు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కుమార్తెల ఆశీస్సుల కారణంగా నేను అధిక సంపన్నుడిని. వారి ఆశీర్వాదాలే నాకు ఎనలేని శక్తి. అదే మూలధనం, అదే రక్షణ కవచం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ముస్లిం మహిళల జీవితాలను రక్షించేందుకు ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా కఠిన చట్టం తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, 90 లక్షల స్వయం సహాయక బృందాల్లో 10 కోట్ల మందికిపైగా మహిళలు ఉన్నారని, వారంతా ఆర్థికంగా సాధికారత పొందారని మోదీ తెలిపారు. 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## ప్రధానికి మహిళా భద్రత

నవ్‌సారిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి భద్రతగా మహిళా పోలీసులను నియమించారు. సుమారు 2500 మంది మహిళా పోలీసులు ఆయనకు భద్రత కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్షన్నర మహిళలు పాల్గొన్నప్పటికీ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మహిళా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. మోదీ పర్యటనలో ఆయన భద్రతను పూర్తిగా మహిళా అధికారులకే అప్పగించడం ఇదే తొలిసారని ఉన్నతాధికారులు తెలిపారు.

# మహిళల చేతిలో మోదీ సోషల్ మీడియా!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన సోషల్ మీడియా నిర్వహణను పలు రంగాల్లో ప్రముఖులైన మహిళలకు అప్పగించారు. వీరిలో చెస్, సైన్స్, గ్రామీణ పారిశ్రామిక వేత్తలు, ఆర్థికరంగంలో కీలకంగా వ్యవహరిస్తున్నవారు ఉన్నారు. వీరంతా తమ తమ రంగాల్లో ఏవిధంగా ఉన్నతస్థాయికి చేరిందీ పేర్కొన్నారు. దేశంలో 'నారీ శక్తి' తోడ్పాటును వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళాభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, ఆడకూతుళ్ల ఆశీస్సులు తన లైఫ్ అకౌంట్‌లోకి వచ్చిచేరాయని, నిరంతరం వారి ఆశీస్సులు పెరుగూతునే ఉన్నాయని, ప్రపంచంలో తనకంటే ధనవంతుడు మరొకరు లేరని మోదీ అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా గుజరాత్ లోని నవసరి జిల్లాలో జి-సఫల్, జి-మిత్రతో సహా పలు పథకాలను ప్రధాని ప్రారంభించారు. లఖ్‌పతి దీదీలతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, మహిళా దినోత్సవం రోజు గుజరాత్ సఫల్, గుజరాత్ మిత్రా పథకాలను ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అనేక పథకాల సొమ్మును నేరుగా బ్యాంక్ అకౌంట్లలోకే బదిలీ చేస్తున్నామన్నారు. "ఈరోజు నారీలోకానికి అంకితమైన రోజు. మహిళల నుంచి స్ఫూర్తి పొందాల్సిన రోజు. వారి నుంచి ఎంతోకొంత నేర్చుకోవాల్సిన రోజు. ఈరోజు నేను ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడనని గర్వంగా చెప్పుకుంటున్నాను. కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, ఆడకూతుళ్లు నిరంతరం ఆశీస్సులు అందజేస్తున్నారు. నాకంటే సంపన్నుడు ఈ ప్రపంచంలోనే లేరు" అని మహిళల హర్షధ్వానాల మధ్య మోదీ చెప్పారు. ఐదుగురు లఖ్‌పత్ దీదీలను లఖ్‌పతి దీదీ సర్టిఫికెట్లను మోదీ ప్రదానం చేశారు. ప్రధానమంత్రి ఈ సందర్భంగా జి-సఫల్ (జీవనోపాధిని పెంచే అంత్యోదయ కుటుంబాల కోసం గుజరాత్ పథకం), జి-మిత్ర పథకాలను ప్రారంభించారు. జి-మిత్ర పథకం కింద గ్రామీణ జీవనోపాధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి పని చేస్తున్న స్టార్టప్‌లకు ఆర్థక సాయం అందిస్తారు. జీ-సఫల్ పథకం కింద అంత్యోదయ కుటుంబాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆర్థిక సాయం, వ్యవస్థాపక శిక్షణ అందిస్తారు.

# వైశాలి చేతికి మోడీ అకౌంట్ నిర్వహణ బాధ్యత




ప్రధాని నరేంద్ర మోడీ సోషల్ మీడియా అకౌంట్‌ను ఓ 23 ఏళ్ల యువతి నిర్వహిస్తున్నారు. ఆయన ట్విట్టర్ ఖాతా పోస్టింగ్ తదితర బాధ్యతలు ఆమెనే చూసుకుంటున్నారు. అసలు ప్రధాని ఖాతాను అంతా తానై నడిపిస్తున్న ఆ యువతి ఎవరు.. అనేది ఇప్పుడు చూద్దాం.. ప్రధాని నరేంద్ర మోడీ సోషల్ మీడియా అకౌంట్ బాధ్యతల్ని ఓ యువతి చూసుకుంటున్నారు. ఆయన ట్విట్టర్ ఖాతాలో పోస్టింగ్స్ రెస్పాన్సిబిలిటీని చూసుకుంటున్న ఆ యువతి వయసు 23 ఏళ్లు మాత్రమే. వణక్కం అంటూ ఆమె పెట్టిన పోస్ట్‌లు ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. కలల్ని కనడం, వాటిని సాకారం చేసుకోవడం కోసం అలుపెరగకుండా ప్రయాణం సాగించాలంటూ ఆమె ఇస్తున్న సందేశాలు అందర్నీ ఆలోచింపజేస్తున్నాయి. ఇవాళ మహిళా దినోత్సవం కావడంతో నారీశక్తికి వందనం అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రధాని మోడీ. ఈ క్రమంలోనే ఆయన ఓ అరుదైన నిర్ణయం తీసుకున్నారు. తన సోషల్ మీడియా అకౌంట్లను హ్యాండిల్ చేసే బాధ్యతల్ని ఎంపిక చేసిన కొందరు స్త్రీలకు ఆయన అప్పజెప్పారు. ఈ తరుణంలోనే మోడీ ఖాతా నుంచి వణక్కం.. అంటూ ఓ పోస్ట్ వచ్చింది. ఆయన అకౌంట్ నుంచి పోస్ట్ పెట్టిన ఆ మహిళ మరెవరో కాదు.. ప్రముఖ చెస్ క్రీడాకారిణి, ఇండియన్ గ్రాండ్ చెస్ మాస్టర్ వైశాలి రమేశ్ బాబు. తాను చెస్ ప్లేయర్‌నని, దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమంటూ ఆమె పోస్ట్ చేశారు. ప్రధాని అకౌంట్‌ను నిర్వహించడం గొప్ప విషయమని.. ఇది తనకు దక్కిన అదృష్టమన్నారు వైశాలి. ఈ రోజు మొత్తం ఆయన అకౌంట్ బాధ్యతల్ని ఆమే చూసుకోనున్నారు. ఇది తనకో ఉత్తేజకరమైన ప్రయాణమని.. ఎన్ని అవరోధాలు ఎదురైనా కన్న కలల్ని సాకారం చేసుకునే దిశగా ప్రయాణం ఆపొద్దని ఓ పోస్ట్‌లో ఆమె రాసుకొచ్చారు. ఆడపిల్లలకు పేరెంట్స్‌తో పాటు తోబుట్టువులు అండగా నిలవాలని కోరారు. వాళ్ల సామర్థ్యంపై నమ్మకం ఉంచాలని రిక్వెస్ట్ చేశారు. కాగా, వైశాలితో పాటు న్యూక్లియర్ స్పేస్ సైంటిస్టులు ఎలినా మిశ్రా, శిల్పి సోని తదితర ప్రముఖులకు కూడా మోడీ అకౌంట్ నుంచి పోస్టులు పెట్టారు.



ఓటర్లలో మహిళా
ఓటర్లు సగభాగం..
అయినా చట్టసభల్లో
దక్కని ప్రాతినిధ్యం

# మన ఆస్తులు ప్రకటిద్దాం

## చీఫ్ జస్టిస్ సహా సుప్రీంకోర్టు జడ్జీలందరి నిర్ణయం

## వెంటనే ఆదాయ వివరాలను ప్రకటించిన సీజే

## స్వచ్ఛందం అన్నపుడు పాటించని న్యాయమూర్తులు





ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టులోని న్యాయమూర్తులంతా తమ ఆస్తుల వివరాలను వెల్లడించాలని నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట భారీగా బయటపడిన నగదు కలకలం రేపుతున్న నేపథ్యంలో దేశ అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జీలు ఇందుకు సిద్ధమయ్యారు. న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి తమ ఆస్తుల వివరాలు ప్రకటించారు. చీఫ్ జస్టిస్ సహా సుప్రీంకోర్టులో ప్రస్తుతం 30 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన వీరందరితో ఫుల్‌కోర్టు సమావేశం జరిగింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రతి ఒక్కరూ తమ ఆస్తుల వివరాలు వెల్లడించాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. అంతకుముందు... 1997లో చేసిన తీర్మానం ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందించాల్సి ఉంది. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను బహిర్గతం చేయాలంటూనే... దానిని తప్పనిసరి చేయకుండా, జడ్జిల ఇష్టానికే వదిలేస్తూ 2009లో ఒక తీర్మానం చేశారు. దీంతో చాలామంది న్యాయమూర్తులు తమ ఆస్తులను బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ఎవరికీ ఆ మినహాయింపు ఉండదు. ప్రధా న న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టు జడ్జిలంతా తమ ఆస్తులను బహిర్గతం చేయాల్సిందే. ఆ వివరాలను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పెడతారు.

# రాజ్యాంగం మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది

## సుప్రీంకోర్టు జస్టిస్ వెంకట నారాయణ

భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట నారాయణ భట్టి తెలిపారు. చట్టం, మహిళా సాధికారిత అంశంపై తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సాధికారత సాధించడానికి రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు ప్రసాదించిందని పేర్కొన్నారు. సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు రాష్ట్రాలకు అధికారం ఇచ్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టి తెలిపారు. సాధికారత ఎగుమతి, దిగుమతి చేసుకొనే సరుకు కాదని మహిళలు తమకు తాముగా సాధించుకోగలరని ఆయన వెల్లడించారు. లింగ బేధం లేకుండా మహిళలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినప్పటికీ అవగాహన లోపం వల్ల చాలా మంది ఆ హక్కులను అనుభవించలేక పోతున్నారని పేర్కొన్నారు. ఒక సంస్థలో, ఇంట్లో, సమాజం, దేశ వ్యవహారాల్లో మహిళలను భాగస్వామ్యలను చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో మహిళా సాధికారతను సాధించాలంటే ప్రతి నిమిషం వారి పనిలో జోక్యం చేసుకోవడం మంచిది కాదని నా అభిప్రాయమని ఈ సందర్భంగా భట్టి అన్నారు. వారి పనిని వారు చేయనివ్వండి, అదే సమయంలో కావాలంటే వారికి మంచి పరిశీలకుడిగా ప్రోత్సహించండి తప్ప పురుషాధిక్యం ప్రదర్శించవద్దని ఆయన ఉద్ఘాటించారు.



# రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు

## మహిళా దినోత్సవ సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.550 కోట్లతో యూనివర్సిటీ నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీఎత్తున నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సులను రేవంత్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత మహిళా సంఘాల స్టాల్స్‌ను మంత్రులతో కలిసి సందర్శించారు. అక్కడే మహిళా పెట్రోల్ బంకుల నమూనాను పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులతో వారి ఉత్పత్తుల గురించి ముచ్చటించారు. వారు తయారు చేసిన రాగి లడ్డూని రేవంత్ రుచి చూసి ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "వందేళ్ల చరిత్ర కలిగిన చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి రూ.550 కోట్ల నిధులు కేటాయించాం. అంతర్జాతీయ యూనివర్సిటీలతో విద్యార్థులు పోటీ పడాలి. రాజకీయాల్లోకి మహిళలు కూడా రావాలి. అవకాశం వస్తే ఆడవారు ఏ రంగంలోనైనా రాణిస్తారు. ఆడబిడ్డలకు అన్నగా మాట ఇస్తున్నా. మిమ్మల్ని కోటీశ్వరుల్ని చేస్తా. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు ఇచ్చి గెలిపించుకుంటామని" చెప్పారు.



# శిశు మరణాల నియంత్రణలో భారత్ భేష్

## పురోగతిలో మార్గదర్శకం: ఐరాస నివేదిక

శిశు మరణాల నియంత్రణలో భారత్ కృషిని ఐక్యరాజ్య సమితి ప్రసంశించింది. ఈ విషయంలో భారతదేశాన్ని ఓ మార్గదర్శక దేశంగా అభివర్ణించింది. ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొంది. ఆరోగ్య వ్యవస్థకు నిధుల కేటాయింపు ద్వారా లక్షలాది మంది శిశువుల ప్రాణాలను భారత్ కాపాడగలిగిందని ప్రస్తుతించింది. శిశు మరణాల అంచనాపై ఐరాస సంయుక్త బృందం తన నివేదికను ఇటీవల విడుదల చేసింది. శిశు మరణాల నియంత్రణలో ఐదు దేశాలను మార్గదర్శక దేశాలుగా పేర్కొంది. వాటిలో భారత్‌తో పాటు నేపాల్, సెనెగల్, ఘనా, బురుండి ఉన్నాయి. నివారించదగ్గ శిశు మరణాల విషయంలో విభిన్న వ్యూహాలను ఈ దేశాలు అనుసరించాయని, తద్వారా శిశు మరణాల నియంత్రణ పురోగతిలో వేగం పెంచాయని ఆ నివేదిక కొనియాడింది. స్థిరమైన పాలన, అవసరమైన నిధుల కేటాయింపు ఈ స్థితికి రావడానికి దోహదపడ్డాయని తెలిపింది. భారత్‌లో 2000 సంవత్సరం నుంచి ఐదేళ్ల లోపు బాలల మరణాలు 70శాతం, నవజాత శిశువుల మరణాలు 61శాతం తగ్గాయని వెల్లడించింది. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల పెరుగుదల, వైద్యాన్ని అందుబాటులోకి తేవడం, ఆరోగ్య పథకాలతో ఇది సాధ్యమైందని తెలిపింది.

# 6 శాతం పట్టణ కుటుంబాలకే రక్షిత కుళాయి నీరు

## తాజా సర్వేలో వెల్లడి

దేశంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఆందోళనకర అంశంగా మారింది. కేవలం 6శాతం ఇళ్లకు మాత్రమే మున్సిపాలిటీల నుంచి తాగడానికి నాణ్యమైన కుళాయి నీరు అందుతోందని తాజా సర్వే వెల్లడించింది. 62శాతం కుటుంబాలు సురక్షితమైన తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫయర్స్, ఆర్వో సిస్టమ్స్ వంటి ఆధునిక నీటి శుద్ధి (ఫిల్టరేషన్) విధానాలపై ఆధారపడుతున్నాయని పేర్కొంది. 'వరల్డ్ వాటర్ డే' సందర్భంగా లోకల్ సర్కిల్స్ అనే సంస్థ తన సర్వే వివరాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల్లో 30 వేలకు పైగా కుటుంబాలపై సర్వే చేశారు. పైపుల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై ప్రశ్నించగా.. కేవలం 30 శాతం కుటుంబాలు మాత్రమే 'మంచి'గా ఉన్నాయని పేర్కొన్నాయి.

# తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ప్రముఖ ఒడియా రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గోపీనాథ్ మహంతి రచించిన 'దాడీ బుధా' అనే నవలను 'ఈతచెట్టు దేవుడు' పేరిట తెలుగులోకి అనువదించినందుకు తుర్లపాటిని ఈ పురస్కారం వరించింది. ఒడిశాలోని బరంపురంలో నివసిస్తున్న రాజేశ్వరి అనేక రచనలను ఒడియా నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. స్వతంత్ర రచనలూ చేశారు. గతంలో అనేక పురస్కారాలను ఆమె స్వీకరించారు. కాగా తెలుగుతోపాటు 21 భాషల్లో అనువాద పురస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రకటించారు. తెలుగు అనువాద పురస్కారాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించిన న్యాయనిర్ణేతల్లో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు, ప్రముఖ రచయితలు దాసరి అమరేంద్ర, గుడిపాటి వేంకటేశ్వర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు.

# రచయిత్రి కమలాదేవికి సింగపూర్ హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు



సింగపూర్‌లో వివిధ రంగాలలో ప్రతిభను కనబరిచిన మహిళలకు అందించే హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు ఈ ఏడాది భారత సంతతి రచయిత్రి కమలాదేవి అరవిందన్‌ని వరించింది. కమలాదేవి (75) తమిళం, మలయాళంలో రచనలు చేస్తున్నారు. ఆమె సాహితీకృషిని సింగపూర్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్స్ ఆర్గనైజేషన్స్ (ఎస్సీడబ్ల్యూ) గుర్తించి, ఈ అవార్డుకు ఎంపిక చేసింది. కమలాదేవి నాటక రచయిత్రిగా విశేష ప్రతిభ కనబరిచారు. నేషనల్ లైబ్రరీ, సింగపూర్ తమిళ రచయితల సంఘం సంయుక్తంగా వర్ధమాన రచయితల కోసం నిర్వహించిన వర్క్‌షాప్‌లను ఆమె నడిపించారు. ఆమె నవల 'సెంబవాంగ్' సింగపూర్‌లో విడుదలైన అత్యుత్తమ రచనలలో ఒకటి. ఆమె రచనలు సింగపూర్, మలేసియా, కెనడా, భారత్‌లో విడుదలై విశేష ఆదరణ పొందాయి. ఇప్పటిదాకా ఆమె 160కి పైగా కథానికలు, వ్యాసాలు, 18 రంగస్థల నాటకాలు, 300 రేడియో నాటకాలను రచించారు.

# మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

## మరింత మెరుగ్గా శక్తి యాప్: ఏపి హోంమంత్రి అనిత



మహిళల రక్షణ, భద్రతే లక్ష్యంగా శక్తి యాప్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె శక్తి యాప్‌పై సమీక్ష నిర్వహించారు. శక్తి యాప్‌ను ఇప్పటికే చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. దీన్ని మరింత సులువుగా, మెరుగైన సేవలు అందించేలా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. యాప్‌పై అనేక మంది రకరకాలుగా మాట్లాడుతున్నారని దాని గురించి పట్టించుకోమన్న ఆమె మహిళల భద్రతే తమకు ప్రధానమని స్పష్టం చేశారు. 'మార్చి 8 మహిళా దినోత్సవం రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శక్తి యాప్‌ను ప్రారంభించారు. దీంతో పాటు ఉమెన్, చైల్డ్ సేఫ్టీ వింగ్‌ని ఏర్పాటు చేశాం. దీనికోసం బడ్జెట్‌లో రూ. 17 కోట్లు కేటాయించాము. శక్తి యాప్ దాదాపు పది సేవలతో అందుబాటులో ఉంది. మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నాం. రూ. 17 కోట్లతో శక్తియాప్ ను మహిళల రక్షణ కోసం తీసుకువచ్చామని తెలిపారు. శక్తి యాప్ ద్వారా 112కు కాల్ చేయవచ్చు. నైట్ షెల్టర్ లు కూడా అందించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కేవలం 5-10 నిమిషాల్లోనే ఆపదలో ఉన్నవారిని రక్షించేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి పూట అవసరమైన మహిళలకు షెల్టర్ అందించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ సైబర్ పోలీసు స్టేషన్‌లు ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి అనిత వెల్లడించారు. జగన్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా ఏపీ పేరు చెప్పేవారని, కూటమి అధికారంలోకి వచ్చాక పరిస్థితిని పూర్తిగా మార్చామని తేల్చి చెప్పారు. గంజాయిపై యుద్ధం చేస్తున్నామని, దీనికోసం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని వివరించారు. ఒడిశా ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున గంజాయి రవాణా అయ్యిందని చెప్పారు. డ్రోన్స్ ద్వారా నేరాలను, గంజాయిని కూడా అరికట్టేలా చర్యలు చేపట్టామన్నారు. గంజాయిని పండిస్తున్న, రవాణా చేస్తున్న వారిపై పీడీ యాక్టు పెట్టేలా తీర్మానం చేశామని అనిత స్పష్టం చేశారు. పోలీసు కుటుంబాలకు వైద్య చికిత్సలకు

సంబంధించి 15 లక్షల రూపాయల మేర ఆరోగ్య బీమా అందించబోతున్నామని మంత్రి వెల్లడించారు.

# నారీ శక్తిని కీర్తించిన నేతలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన మహిళలను సత్కరించారు. నారీ శక్తికి వందనం అంటూ కీర్తించారు. విజయనగరంలో ప్రభుత్వం నిర్వహించిన మహిళా దినోత్సవంలో హోంమంత్రి అనిత, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఆడపిల్లలే ముఖ్యమని నేటి సమాజం భావిస్తోందన్న హోంమంత్రి, మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయురాలిగా ఉన్న తనను చంద్రబాబు హోం మినిస్టర్ చేశారని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో ఎవరికైనా మూడో ఆడబిడ్డ పుడితే రూ.50వేలు డిపాజిట్ చేస్తానని ఎంపీ అప్పలనాయుడు హామీ ఇచ్చారు. అమలాపురంలో మంత్రి అచ్చెన్న స్వయం సహాయక బృందాలకు చెక్కులు అందించారు. ఏలూరు సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళల భద్రతే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. మహిళలు, యువతుల భద్రతకు అభయ యాప్ తెచ్చినట్లు ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. భీమవరంలో 2కే రన్ నిర్వహించారు. కాస్మోటిక్ క్లబ్‌లో మహిళలను సత్కరించారు. విజయవాడలో 2వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. సిద్దార్థ మహిళా కళాశాల విద్యార్థినుల నృత్యాలు, మహిళా పోలీస్ డ్రోన్ పైలెట్స్ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. విజయవాడ జనసేన పార్టీ కార్యాలయంలో మహిళలను సత్కరించారు. నందిగామలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన మహిళలను ఘనంగా సన్మానించారు. గుడివాడలో సాంస్కృతిక, క్రీడా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బహుమతులు అందజేశారు.

### మూడోసారి ఆడబిడ్డ జన్మిస్తే రూ.50 వేలు - మగబిడ్డ పుడితే ఆవు, దూడ : ఎంపీ కలిశెట్టి

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేయటం ద్వారా సమాజం ఆరోగ్యంగా ఉండేలా చూస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆమె ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బాపట్ల జిల్లా కూచిపూడిలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఉమెన్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. చీరాలలో ఇండియన్ మెడికల్

అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి మహిళలను సన్మానించారు. నెల్లూరులో కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన వేడుకల్లో మంత్రి ఫరూక్ పాల్గొన్నారు. అనంతపురంలో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళ హక్కుల గురించి వక్తలు వివరించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఉరవకొండలో ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. రాయదుర్గంలో మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కర్నూలులో మహిళలను ఎంపీ బస్తిపాటి నాగరాజు సన్మానించారు. కర్నూలు కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ బాక్స్‌ను కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోం మంత్రి అనిత మాట్లాడుతూ, ఆడపిల్లలే ముఖ్యం అని ఇప్పుడు సమాజం భావిస్తోందన్నారు. ఇందుకు నందమూరి తారకరామారావు చొరవే కారణమన్నారు. అన్న ఎన్టీరామారావు చొరవతోనే, వంటింటి నుంచి అసెంబ్లీలో అధ్యక్ష అనే స్థాయికి మహిళలు ఎదిగారని పేర్కొన్నారు. మహిళలు ఎప్పుడో సాధికారత సాధించారు. చంద్రబాబు నాయుడు ఆనాడు తీసుకున్న నిర్ణయం కారణంగా, డ్వాక్రా సంఘాలు ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని అనిత వెల్లడించారు. రాజకీయాలు అనగానే కోట్లాది రూపాయాల ఆర్థిక స్థోమత ఉండాలనుకుంటారు, కానీ తాను ఒకప్పుడు ఒక సాధారణ ఉపాధ్యాయురాలినని గుర్తుచేసుకున్నారు. కేవలం తన చదువే పెట్టుబడిగా రాజకీయాల్లో ఎదిగానని చెప్పారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. ఆడపిల్లలను ధైర్యంగా పెంచాలని సూచిస్తూనే, తల్లిదండ్రులు పిల్లలకు చదువుని ఆస్తిగా ఇవ్వాలని సలహా ఇచ్చారు. ఆడపిల్లలు లాగే మగ పిల్లలను కూడా జాగ్రత్తగా, క్రమశిక్షణగా పెంచాలని సూచించారు.



# తెలంగాణ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి



తెలంగాణ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పర్కాపూర్‌కు చెందిన కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెతో పాటు ఆరుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. సీతాదయాకర్‌రెడ్డి ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా ఆమెకు సీఎం శుభాకాంక్షలు చెప్పారు. చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించిన రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# చెన్నైలో మహిళలకు 100 పింక్ ఆటోలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లబ్ధిదారులకు 100 పింక్ ఆటోలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో సీఎం స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ, మహిళా సాధికారతా శాఖ తరపున పింక్ ఆటోలను లబ్ధిదారులకు అందించారు. రూ.72 కోట్లతో కాంచీపురం, ఈరోడ్, ధర్మపురి, శివగంగ, థేని, కడలూరు, నాగపట్నం, రాణిపేట్, కరూర్ జిల్లాల్లో 'న్యూ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్'ను నిర్మించనున్నట్టు సీఎం ప్రకటించారు. కొత్తగా నిర్మించనున్న మహిళా హాస్టళ్లలో 700 పడకలు, బయోమెట్రిక్ ఎంట్రీ, వైఫై, స్వచ్ఛమైన తాగునీరు, 24 గంటలూ భద్రత వంటి సౌకర్యాలు కల్పిస్తామని స్టాలిన్ చెప్పారు. ఈ సందర్భగా అర్బన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చెందిన మహిళలకు పర్యావరణ, వాతావరణ మార్పు శాఖ తరపున 50 ఆటోలను ఆయన అందజేశారు. మదర్ థెరిస్సా ఉమెన్స్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ యశోద షణ్ముగసుందరానికి అవ్వయార్ అవార్డు-2025ను సీఎం ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభచూపిన వారికి ఇచ్చే "స్టేట్ గర్ల్ చైల్డ్ ప్రొటెక్షన్ డే" అవార్డులను కన్యాకుమారి జిల్లా కలెక్టర్ అళుగు మీన, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్‌కు ప్రదానం చేశారు. దీనికిముందు, మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం వీడియో సందేశం ఇచ్చారు. మహిళలు ఏరంగంలో ఉన్నా వారికి తగిన గౌరవం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ఈ-సేవా కేంద్రాల్లో మహిళలు కొనుగోలు చేసే కో-ఆప్టెక్స్ ఉత్పత్తులపై 5 శాతం తగ్గింపు, సర్వీస్ చార్జీల్లో 10 శాతం తగ్గింపు ఇస్తామని తెలిపారు.

# రాజమహేంద్రవరంలో మహిళల కోసం పింక్ టాయిలెట్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మహిళల కోసం పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చింది. అందులో ఏర్పాటు చేసిన వసతులను చూస్తే వాటిని విశ్రాంతి మందిరాలు అనొచ్చు. కేవలం మహిళల కోసమే ఉద్దేశించిన వీటిని మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించారు. చారిత్రక, ఆధ్యాత్మిక నగరమైన రాజమహేంద్రవరంలోని గోదావరి తీరానికి పెద్ద సంఖ్యలో భక్తులు స్నానాల కోసం వస్తుంటారు. వారిని దృష్టిలో పెట్టుకొని 'స్వచ్ఛ నగరం' లక్ష్యంగా 10 లక్షల రూపాయలతో పింక్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. మొదట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా అందుబాటులోకి తీసుకువచ్చారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో భాగంగా మహిళలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. స్నానాలు చేసేందుకు వసతులు, చిన్న పిల్లల తల్లులకు ప్రత్యేక గదులు కూడా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా పిల్లలను నిద్రపుచ్చేందుకు ఊయల, నాప్కిన్ యంత్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. మహిళలు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గదులు కూడా ఉన్నాయి. పింక్ టాయిలెట్లను త్వరలో మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయనున్నారు. 2027లో జరగనున్న పుష్కరాల నేపథ్యంలో గోదావరి తీరాన్ని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపారు.

## విజయవాడలో..

విజయవాడ నగర పాలక సంస్థ 20 లక్షల రూపాయలతో బెంజ్ సర్కిల్‌లో మహిళల కోసం పింక్ టాయిలెట్‌ను అందుబాటులో తెచ్చింది. నగరంలో ప్రధాన కూడళ్లలో మరిన్ని పింక్ టాయిలెట్లను నిర్మించి మహిళలకు అందుబాటులోకి తెస్తామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. నగరంలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని.. దాన్ని దృష్టిలో పెట్టుకుని పింక్ టాయిలెట్ నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. మహిళల నెలసరి సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి, చిన్నపిల్లలకు పాలు ఇవ్వడానికి ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ అంతా మహిళా సిబ్బంది మాత్రమే పనిచేస్తారని వెల్లడించారు. పింక్ టాయిలెట్లకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే బెంజ్ సర్కిల్‌లో పింక్ టాయిలెట్‌ను నిర్మించడం వల్ల మహిళలకు, కాలేజి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# క్రమశిక్షణ తప్పినా మిమ్మల్ని శిక్షించలేం

## విద్యార్థుల ఎదుట గుంజీలు తీసిన విజయనగరం హెడ్‌మాస్టర్

విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చింతా రమణ గుంజీలు తీసిన స్వీయ శిక్ష వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విద్యావర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పాఠశాలలో 285 మంది విద్యార్థులుండగా, 15 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఈనెల 11న విద్యార్థులను ఆవరణలోకి పిలిచిన హెచ్‌ఎం రమణ.. వారికి సాష్టాంగ నమస్కారం చేశారు. 'మేము కొట్టలేం. తిట్టలేం. ఏమీ చేయలేం. మీ ఎదుట చేతగానివారిలా చేతులు కట్టుకుని ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. క్రమశిక్షణ తప్పితే ఇక మిమ్మల్ని శిక్షించబోం. మాకు మేమే శిక్ష అనుభవిస్తాం' అంటూ వారి ఎదుటే గుంజీలు తీశారు. విద్యార్థులు 'వద్దు సర్.. వద్దు సర్' అంటున్నా, ఆయన గుంజీలు తీశారు. ఈ వీడియోపై మంత్రి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో స్పందించారు. 'చెప్పిన మాట వినడం లేదని విద్యార్థులను దండించకుండా, గుంజీలు తీసిన వీడియో సామాజిక మాధ్యమాల ద్వారా నా దృష్టికి వచ్చింది. అందరం సమష్టిగా పనిచేసి, విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారు. విద్యా ప్రమాణాలు పెంచుదాం. పిల్లల విద్యా, శారీరక, మానసిక వికాసానికి కృషి చేసి, వారి భవితకు బంగారు బాటలు వేద్దాం' అని పేర్కొన్నారు.






# బుల్డోజర్ న్యాయం అమానవీయం

## 'నిలువ నీడ' ప్రాథమిక హక్కులో భాగం

## అధికారుల చర్య దౌర్జన్యపూరితం

## బాధితులకు 10లక్షల చొప్పున పరిహారం

## యూపీ సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశాలు



అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను కూల్చివేస్తూ బుల్డోజర్ న్యాయం అమలు చేస్తున్నందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టబద్ధంగా తగిన ప్రక్రియను పాటించకుండా ఇళ్లను కూల్చివేయడం 'అమానవీయం, అక్రమం' అని వ్యాఖ్యానించింది. ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వంతున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ప్రయాగ్‌రాజ్‌లోని లుకేర్‌గంజ్‌లో ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీడీఏ) ఇళ్లను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. "ఇలాంటి కేసులు మన అంతరాత్మను షాక్‌కు గురిచేస్తాయి. అధికారులు దౌర్జన్యపూరితంగా వ్యవహరించి నివాసాలను కూల్చి వేశారు. శిథిల భవనం వద్ద ఓ చిన్న బాలిక దీనంగా నిల్చొని ఉన్న వీడియో వైరల్‌గా మారింది. ఇలాంటి దృశ్యాలు కలచివేస్తాయి. నిలువ నీడను కలిగి ఉండే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పొందుపరిచిన ప్రాథమిక హక్కులో అంతర్భాగం" అని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉండగా, ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలయ్యే కొత్త వ్యాజ్యాలను స్వీకరించబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకే అంశంపై పలు విచారణలను అంగీకరించబోమని తెలిపింది.

# అరెస్టుల్లో పోలీసులు హద్దులు దాటొద్దు

అరెస్టుల విషయంలో పోలీసులు హద్దులు దాటొద్దని సుప్రీంకోర్టు మరోమారు హెచ్చరించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు నిందితులకు ఉంటాయని, అరెస్టు విషయంలోనూ గౌరవమర్యాదలను పాటించాలని హితవు పలికింది. హరియాణాలో.. వరకట్న వేధింపుల కేసులో అరెస్టయిన ఓ బాధితుడి పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హరియాణా పోలీసులు తనను అరెస్టు చేసే సమయంలో.. పోలీస్‌స్టేషన్‌లో తనపై దాడి చేశారని బాధితుడు పేర్కొన్నారు. “అరెస్టు సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలను ఈ కోర్టు ఎన్నో సందర్భాల్లో జారీ చేసింది. దాన్ని కింది స్థాయి అధికారులకు వివరించాల్సిన బాధ్యత డీజీపీదే” అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్నేశ్‌కుమార్, తదితర కేసుల తీర్పులను తాజాగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలకు పంపింది.

# జైళ్లలో దివ్యాంగ ఖైదీలకున్న సౌకర్యాలేంటి?

## నివేదిక సమర్పించండి.. కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

జైళ్లలో వికలాంగ ఖైదీలకు ఉన్న సౌకర్యాలపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జైలులో దివ్యాంగులకు సరైన వసతులు లేకపోవడం వల్లే ప్రొఫెసర్ సాయిబాబ, ఫాదర్ స్టాన్‌స్వామి మరణించారని ఆరోపిస్తూ సత్యన్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. భీమా కోరేగావ్ హింస కేసులో విచారణ ఖైదీగా జైలులో ఉండగానే స్టాన్‌స్వామి 2021లో ప్రాణాలు విడిచారు. 2014లో మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో అరెస్టయిన సాయిబాబ నిర్దోషిగా విడుదలైన కొన్ని నెలల్లోనే మరణించారు. జైళ్లలో వికలాంగులకు తగు ఏర్పాట్లు లేని కారణంగానే ఇద్దరు మరణించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది.

# 454 చెట్లను నరికించిన వ్యక్తికి 4.54 కోట్ల ఫైన్

తాజ్‌మహల్ సమీపంలో చట్టవిరుద్ధంగా చెట్లను నరికించిన ఓ వ్యక్తికి సుప్రీంకోర్టు ఒక్కో చెట్టుకు రూ.లక్ష చొప్పున మొత్తం 454 చెట్లకు రూ.4.54 కోట్ల భారీ జరిమానా

విధించింది. తాజ్‌మహల్ చుట్టూ రక్షిత ప్రాంతంగా ప్రకటించిన ప్రాంతంలోని ఓ ప్రైవేటు స్థలంలో ఉన్న 422 చెట్లు, వాటి పక్కనే రక్షిత అడవిలో ఉన్న మరో 32 చెట్లను శివ్‌శంకర్ అగర్వాల్ అనే వ్యక్తి అక్రమంగా నరికించాడు. ఈ రక్షిత ప్రాంతంలోని చెట్లను నరికివేయరాదని 2015లోనే సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయినా అతడు దాన్ని ఉల్లంఘించాడు. తాను తప్పును అంగీకరిస్తున్నానని, జరిమానా తగ్గించాలని శివ్‌శంకర్ విన్నవించుకోగా బెంచ్ తిరస్కరించింది. "పెద్దఎత్తున చెట్లను నరికివేయడం ఓ మనిషిని హత్య చేయడంకంటే దారుణం" అని పేర్కొంది.

# భావ ప్రకటనా స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

భావ ప్రకటనా స్వేచ్ఛపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్య దేశంలో ఒక భాగమని.. దాన్ని పరిరక్షించడం కోర్టుల బాధ్యత అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గుజరాత్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్య సమాజంలో ఒక అంతర్భాగమని.. దాన్ని రక్షించడం కోర్టుల విధి అని స్పష్టం చేసింది. గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి గతేడాది అనగా 2024, డిసెంబర్‌లో తన ట్విట్టర్ ఖాతాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఇమ్రాన్ ఓ పెళ్లి వేడుకకు హాజరైన సందర్భంగా తీసిన వీడియో అది. దానిలో ఇమ్రాన్.. పెళ్లి వేడుక మధ్యలో నుంచి నడిచి వస్తుండగా.. ఆయనపై పూల వర్షం కురిపిస్తారు. ఇక బ్యాగ్రౌండ్‌లో ఓ పద్యం కూడా వినిపిస్తుంది. అయితే ఈ పద్యంలోని పదాలు.. మత విశ్వాసాలు, జాతి ఐక్యతను దెబ్బ తీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ.. ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాల్సిందిగా కోరుతూ.. ఇమ్రాన్ గుజరాత్ కోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించిన కోర్టు.. దాన్ని కొట్టేసింది. దీన్ని సవాల్ చేస్తూ.. ఇమ్రాన్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. తాజాగా జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జ్ భుయాన్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఇమ్రాన్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా గుజరాత్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. వాక్ స్వాతంత్ర్యంపై కీలక వ్యాఖ్యలు చేసింది. "కవిత్వం, సినిమా, నాటకాలు, కళలు, సాహిత్యం వంటి అంశాలు మనుషుల జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ లేనప్పుడు వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతాయి.

అలాంటప్పుడు ప్రతి వాదనలతో వాటిని ఎదుర్కోవాలి.. తప్ప అణచివేయాలని చూడకూడదు. ఒకవేళ ఈ వ్యాఖ్యలపై ఆంక్షలు విధిస్తే.. అవి సరైనవిగా ఉండాలి తప్పితే ఊహాజనితంగా కాదు. ఓ వ్యక్తి వెలిబుచ్చే అభిప్రాయాలను ఎంతమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడటం న్యాయస్థానాల విధి" అని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాక ఎంపీపై నమోదైన కేసును కొట్టి వేసింది.

# కోల్‌కతా హైకోర్టుకు వెళ్లండి

## బాధితురాలి తల్లిదండ్రులకు సుప్రీం అనుమతి

కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్యకు గురైన బాధితురాలి కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సీబీఐని ఆదేశించాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. దీనిపై దర్యాప్తు చేయించాలని కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీజేఐ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ దశలో తిరిగి దర్యాప్తు జరపాల్సిందిగా సీబీఐని ఆదేశించలేమని పేర్కొంది. బాధితురాలి కుటుంస సభ్యుల తరఫున సీనియర్ అడ్వకేట్ కరుణ నుండి హాజరుకాగా, సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. మెడికో హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు జనవరి 20న సీల్దా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అయితే మరికొందరి పాత్రను నిర్ధారించేందుకు సీబీఐ మరింత లోతైన దర్యాప్తు జరపాలని బాధితురాలి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు సీబీఐను ఆదేశించాల్సిందిగా వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సీబీఐ తరఫు న్యాయవాది వాదన విన్న అనంతరం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించడం సముచితమని సుప్రీం ధర్మాసనం భావించింది.

### న్యాయం కోరుతూ కోల్‌కతాలో ర్యాలీలు

కాగా, హత్యాచార బాధితురాలి న్యాయం జరగాలని కోరుతూ ఈనెల మొదట్లో రెండు ర్యాలీలు కోల్‌కతాలో జరిగాయి. హత్యాచార ఘటన జరిగిన ఏడు నెలలైన సందర్భంగా ఈ

ఘటనను ఖండిస్తూ పౌర సమాజాలు ర్యాలీలు చేపట్టారు. మార్చి 1న విద్యాశాఖ మంత్రి బ్రత్య బసు వాహనం ఢీకొనడంతో జాదవ్‌పూర్ క్యాంపస్ స్టూడెంట్ గాయపడిన ఘటనపై కూడా వీరు నిరసన తెలిపారు. ఆర్జీ కర్ మెడికో హత్యాచార ఘటనలో నిందితులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సంజీవ్ రాయ్‌కు జీవితాంతం జైలులోనే ఉండాలని సీల్దా కోర్టు శిక్ష విధించగా, ఈ నేరంలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మరో ముగ్గురి ప్రమేయం ఉందని, వారిని కూడా అరెస్టు చేయాలని బాధితురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. తొలుత ఈ కేసుపై కోల్‌కతా పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆ తర్వాత కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించారు.

# అనుమతి లేకుండా మహిళల ఫొటోల వినియోగం ఆందోళనకరం



## కేంద్రం, తెలంగాణ సహా 4 రాష్ట్రాలకు బాంబే హైకోర్టు నోటీసులు

ఎలాంటి అనుమతి తీసుకోకుండా మహిళల ఫొటోలను ప్రకటనల్లో ఉపయోగించడం చట్టవ్యతిరేకమని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. వాటిని ప్రభుత్వ ప్రకటనల్లో ఉపయోగించినా అది' వాణిజ్యపర దోపిడీ' కిందకే వస్తుందని తెలిపింది. ఎలాంటి అంగీకారం తీసుకోకుండానే తన ఫొటోను ప్రభుత్వ ప్రకటనల్లో ఉపయోగించారని పేర్కొంటూ నమ్రత అంకుశ్ కవాలే అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జి.ఎస్.కులకర్ణి, జస్టిస్ అద్వైత్ సేత్నాల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సమాధానం చెప్పాలంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసా రాష్ట్రాల ప్రభుత్వాలు, కాంగ్రెస్ పార్టీ, అమెరికాకు చెందిన షట్టర్‌స్టాక్ వెబ్‌సైట్, టోటల్ డెంటల్ కేర్ ప్రైవేటు లిమిటెడ్, సంబంధిత ఫొటోగ్రాఫర్, ఇతరులకు నోటీసులు పంపించింది. ఈ నెల 24లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నమ్రత కవాలే గ్రామానికే చెందిన తుకారాం కార్వే అనే ఫొటోగ్రాఫర్ ఆమె ఫొటో తీశాడు. ఆమె నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే షట్టర్‌స్టాక్ వెబ్‌సైట్‌లో పెట్టాడు. ఈ వెబ్‌సైట్ నుంచి ఎవరైనా ఫొటోలు కొనుక్కొని

డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. దాంతో ఆమె ఫొటోను ఉపయోగించుకొని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు విడుదల చేయడంతో పాటు, హోర్డింగ్‌లు కూడా పెట్టాయి. తన అనుమతి లేకుండానే ఫొటోలను ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఇకపై తన ఫొటోను ఉపయోగించకూడదంటూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# ఖాళీగా ఉంటూ మనోవర్తి కోరలేరు

## ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ




అన్ని విద్యార్హతలు కలిగి, సంపాదించే సామర్థ్యం ఉండే మహిళ ఖాళీగా ఉంటూ భర్త నుంచి మధ్యంతర భృతి కోరలేదని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. మనోవర్తి అన్నది భద్రత, సమానత్వం కలిగించడానికి ఉద్దేశించిందే తప్ప ఖాళీగా కూర్చోమని చెప్పేదికాదని పేర్కొంది. ఓ జంటకు 2019 డిసెంబరులో వివాహం జరిగింది. అనంతరం సింగపూర్‌లో నివసించడం ప్రారంభించింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య 2021 ఫిబ్రవరిలో తిరిగి వచ్చేసింది. 2021 జూన్ నుంచి మేనమామ ఇంట్లో ఉంటోంది. పోషణ నిమిత్తం భర్త నుంచి మధ్యంతర మనోవర్తి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించింది. అయితే, ఆమె ఉన్నత విద్యావంతురాలని, సంపాదించే సామర్థ్యం ఉందని భర్త తెలిపాడు. నిరుద్యోగిగా ఉన్నానన్న కారణం చూపి మనోవర్తి కోరలేదని పేర్కొన్నాడు. ఆమె ఆస్ట్రేలియాలో మాస్టర్ డిగ్రీ చేసిందని, పెళ్లికి ముందు దుబాయ్‌లో ఉద్యోగం కూడా చేసినట్టు కోర్టు దృష్టికి తెచ్చారు. భర్త వాదనతో ఏకీభవించిన కోర్టు మనోవర్తి మంజూరు చేసేందుకు నిరాకరించింది. తాను ఖాళీగా ఏమీ లేనని, ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్నానని అమె కోర్టుకు చెప్పగా, అందుకుతగ్గ ఆధారాలు చూపలేదని కోర్టు అభ్యంతరం తెలిపింది.

# అమ్మాయిని అక్కడ తాకడం అత్యాచారం కాదు..
# అలహాబాద్ హైకోర్ట్ సంచలన తీర్పు..

ఓ మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి



రామ్ మనోహర్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మైనర్ బాలిక వక్షోజాలను తాకడం, ఆమె పైజామా తాడును తెంపడాన్ని అత్యాచార నేరంగా పరిగణించలేమని వ్యాఖ్యానించారు. ఈ చర్యలు తీవ్రమైన లైంగిక దాడి కిందకు వస్తాయని, ఆ చర్యను అత్యాచారంగా పరిగణించలేమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో పవన్, ఆకాష్ అనే ఇద్దరు వ్యక్తులు ఓ పదకొండేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. 2021 సంవత్సరంలో పవన్, ఆకాష్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్ మీద వెళ్తూ 11 ఏళ్ల బాలికకు లిఫ్ట్ ఇచ్చారు. మార్గమధ్యంలో ఆమెపై దాడికి పాల్పడారు. బాధితురాలి వక్షోజాలను పట్టుకుని, ఆమె పైజామా తాడును తెంపేశారు. తర్వాత ఆమెను కల్వర్టు కిందకు లాగడానికి ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో అటుగా వెళ్లేవారు జోక్యం చేసుకోవడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాస్‌గంజ్ ట్రయల్ కోర్టు ఆదేశాలతో పవన్, ఆకాష్‌పై పోక్సో చట్టంలోని సెక్షన్ 18, సెక్షన్ 376 కింద సమన్లు జారీ చేశారు. ట్రయల్ కోర్టు ఆదేశాలను నిందితులు అలహాబాద్ హైకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు న్యాయమూర్తి రామ్ మనోహర్ మిశ్రా సమన్లలోని సెక్షన్లను సవరిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. మైనర్ బాలిక వక్షోజాలను తాకడం, ఆమె పైజామా తాడును తెంపడం, కల్వర్టు కిందకు తీసుకెళ్లడాన్ని అత్యాచారంగా, అత్యాచార యత్నంగా పరిగణించలేమని అన్నారు. నిందితులు చేసిన నేరాలు పోక్సో చట్టంలోని సెక్షన్ 18, సెక్షన్ 376 కిందకు రావని స్పష్టం చేశారు. నిందితులపై పోక్సో చట్టంలోని సెక్షన్ 9/10 (తీవ్రమైన లైంగిక వేధింపులు), సెక్షన్ 354-బి (మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఉద్దేశంతో దాడి) కింద కేసులు నమోదు చేసి విచారించాలని ఆదేశించారు.

## అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ

బాలిక ఛాతీపై చేయి వేసి వక్షోజాలను లాగడం, ఆమె ధరించిన పైజామా తాడును లాగి తెంపివేయడం రేప్ కిందికి రాదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై

సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై సుమోటోగా విచారణ జరపనున్నట్లు ప్రకటించింది. ఇలాంటి చర్యలు అత్యాచారం కిందికి రావని, కానీ అత్యాచారయత్నంగా పరిగణించవచ్చని పేర్కొంటూ హైకోర్టు ఈ నెల 17న తీర్పు ఇచ్చింది. బలప్రయోగం చేసి వస్త్రాలను లాగడం, నగ్నంగా ఉండాలంటూ బెదిరించడం అన్న నేరాల కిందకు వస్తుందని తెలిపింది. అందువల్ల ఐపీసీలోని సెక్షన్ 354(బీ) కింద కేసు నమోదు చేస్తే సరిపోతుందని, రేప్‌కు వర్తించే సెక్షన్లు అవసరం లేదని తెలిపింది. ఈ తీర్పుపై విమర్శలు రావడంతో సుమోటోగా విచారణ జరపాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మాసిహ్ ధర్మాసనం నిర్ణయించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు కాగా దాన్ని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ప్రసన్న బి వరాలే ధర్మాసనం తిరస్కరించడం గమనార్హం. 2021 జనవరి పదో తేదీన పవన్, ఆకాశ్ 14ఏళ్ల బాలికను ఓ కల్వర్టు కిందకు లాకెళ్లారు. పవన్ ఆమె ఛాతీభాగంపై చేయివేయగా, ఆకాశ్ ఆమె పైజామా తాడును లాగాడు. అప్పుడే ఎవరో రావడం చూసి వారు పారిపోయారు. ఈ కేసులో పోలీసులు నిందితులపై సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 కింద కేసు పెట్టారు. అయితే, తాము చేసిన నేరాన్ని బట్టి చూస్తే ఇవి కఠిన శిక్షలు పడే సెక్షన్లు కావడంతో వాటిని తగ్గించాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన జస్టిస్ రామ్ వారి వాదనతో ఏకీభవించారు.

# ప్రణయ్ హత్య కేసు.. సంచలన తీర్పు వెలువరించిన నల్గొండ కోర్టు..

నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన పరువు హత్య రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. 2018 లోఅమృత ప్రణయ్ లు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి అమృత  తండ్రికి ఇష్టంలేదు. దీంతో సుపారీ గ్యాంగ్ తో 2018 సెప్టెంబర్ 14న అమృత ప్రెగ్నెంట్ నేపథ్యంలో ఆస్పత్రికి చెకప్‌కు వెళ్తుండగా.. సుపారీ గ్యాంగ్ దారికాచి అత్యంత క్రూరంగా ప్రణయ్‌ను హత్య చేశారు. ఈ ఘటనలో పోలీసులు 8 మందిపై కేసులను నమోదు చేశారు. ఈ పరువు హత్య అప్పట్లో పెను సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో దీనిపై పోలీసులు విచారణ జరిపారు. దాదాపు.. 1600ల పేజీల చార్జ్‌షీట్ ను నల్గొండ కోర్టులో దాఖలు చేశారు. ఈ రోజున దీనిపై నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు తుదితీర్పును వెలువరించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న మారుతీరావు... 2020లో బెయిల్ మీద విడుదలై

ఆత్మహత్య చేసుకున్నారు. దాదాపుగా ఈ కేసులో ఐదేళ్లకు పైగా ఎక్కువగా విచారణ జరిగింది. నల్గొండ పోలీసులు ఈ పరువు హత్య కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అంతేకాకుండా.. ప్రతి ఒక్క ఎవిడెన్స్‌లను సేకరించి.. కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో నల్గొండ కోర్టు తాజాగా... ఏ2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధించింది. నిందితులందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ రెండో అదనపు న్యాయ స్థానం తీర్పును వెల్లడించింది. ముఖ్యంగా.. 302, 120 ఐపీసీ, 109, 1989 సెక్షన్ ఐపీసీ ఇండియన్ ఇండియన్ ఆర్మ్ యాక్ట్ 1959 ప్రకారం శిక్ష విధించింది. ప్రణయ్ పరువు హత్య కేసులో.. ఏ1 గా మారుతీరావు, ఏ2గా సుభాష్ శర్మ(బీహార్), ఏ3గా అస్గర్ అలీ, ఏ4 గా అబ్దాల్ భారీ, ఏ5 గా, అబ్దుల్ కరీం, ఏ6 గా శ్రావణ్ (మారుతీ రావు తమ్ముడు), ఏ7గా శివ (మారుతీరావు కారు డ్రైవర్), ఏ8 గా నిజాం (ఆటో డ్రైవర్)లుగా ఈ కేసులో ఉన్న నిందితులకు కోర్టు తుది శిక్షను విధించింది.

## బద్లాపూర్ ఎన్‌కౌంటర్ కేసులో ముంబై హైకోర్టు సంచలన తీర్పు

## ఐదుగురు పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఆదేశం

మహారాష్ట్రలోని రాణె జిల్లా బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన లైంగిక దాడి కేసు సంచలనమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అక్షయ్ షిండే ఆ తర్వాత పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. దీనిపై ముంబై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాల్పుల్లో పాల్గొన్న ఐదుగురు పోలీసులపై రెండ్రోజుల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తునకు 'సిట్' ఏర్పాటు చేయాలని క్రైం బ్రాంచ్ జాయింట్ పోలీస్ కమిషనర్‌కు సూచించింది. జస్టిస్ రేవతి మోహిత్ దేరే, డాక్టర్ నీల గోఖలేతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. ఈ కేసులో ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. ఇలాంటి చర్యలతో రాష్ట్ర చట్టబద్ధతను, నేర న్యాయ వ్యవస్థపై సామాన్యుల విశ్వాసం దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ దీనిపై వివరణ ఇస్తూ, ఈ కేసును సీఐడీ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందన్నారు. విస్తృత దర్యాప్తునకు అలహాబాద్ హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిషన్ కూడా ఏర్పాటు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. రెండ్రోజుల్లోగా సిట్‌కు అన్ని పేపర్లను సీఐడీ అందజేయాలని ఆదేశించింది.

# భార్యను చంపి.. అత్తమామలకు ఫోన్..

మీరట్‌కు చెందిన మర్చంట్ నేవీ ఆఫీసర్ సౌరభ్ ఘటన మరువక ముందే మరో దారుణ ఘటన వెలుగు చూసింది. ఈ ఘటనలో భర్త .. భార్యను చంపేశాడు. ఆమెను ముక్కలుగా కోసి సూటుకేసులో కుక్కాడు. అనంతరం అత్తామామలకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఈ దారుణం బెంగళూరు నగరంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన రాకేష్, గౌరీ అనిల్ సంబేకర్ భార్యాభర్తలు. వీరిద్దరూ బెంగళూరులో ప్రైవేట్ జాబ్‌లు చేస్తున్నారు. దొడ్డకన్నహళ్లిలోని ఓ ఇంట్లో గత సంవత్సరం నుంచి అద్దెకు ఉంటున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ, రాకేష్ తన భార్యను చంపేశాడు. అనంతరం ఆమె శవాన్ని ముక్కలు ముక్కలుగా కోసేశాడు. ఆ ముక్కల్ని సూట్ కేసులో నింపాడు. అనంతరం మహారాష్ట్రలో ఉంటున్న గౌరీ అమ్మానాన్నలకు ఫోన్ చేశాడు. మీ కూతుర్ని చంపేశాను - అంటూ వారికి ఏం జరిగిందో వివరించి చెప్పాడు. గౌరీని ముక్కలు చేసి సూట్ కేసులో పెట్టిన సంగతి కూడా చెప్పాడు. గౌరీ తల్లి దండ్రులు ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు హులిమావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న హులిమావు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ సూట్ కేసులో గౌరీ శరీర భాగాలు వెలుగు చూశాయి. వాటిని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రాకేష్ కోసం అన్వేషిస్తున్నారు.

## భార్య, అత్త కలిసి..

మరో ఘటనలో ఓ వ్యాపారి తన భార్య, అత్త చేతిలో దారుణంగా హత్యకు గురయ్యాడు. బెంగళూరుకు చెందిన సింగ్ అనే వ్యక్తి పలువురు అమ్మాయిలతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. అక్రమ వ్యాపారాలు కూడా చేస్తున్నాడు. సింగ్ చేసే తప్పుడు పనులు చూసి అతడి భార్య, అత్త తట్టుకోలేకపోయారు. ఇద్దరూ కలిసి అతడ్ని చంపాలని నిశ్చయించుకున్నారు. రాత్రి పూట అతడు తినే తిండిలో నిద్రమాత్రలు కలిపారు. అతడు మత్తులోకి జారుకున్న తర్వాత కారులో చిక్కబనవారలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ అతడి గొంతు కోసి చంపేశారు. శవాన్ని కారులోనే వదిలేసి ఇంటికి వచ్చేశారు. చివరకు పోలీసులకు దొరికిపోయారు.

# 14 ఏళ్ల బాలికకు బలవంతంగా పెళ్లి

కర్ణాటకలో తాజాగా దారుణం వెలుగు చూసింది. 14 ఏళ్ల చిన్నారిని బలవంతంగా పెళ్లి చేసుకున్న ఓ ప్రబుద్ధుడు చిన్నారిని భుజాన వేసుకుని తన ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో నిందితులపై పోక్సో, బాల్య వివాహ చట్టాల కింద కేసు నమోదు చేశారు. నిర్మానుష్య ప్రదేశంలో దిక్కులు పిక్కటిల్లేలా బాలిక ఆర్తనాదాలు.. ఆమెను భుజాన వేసుకుని బలవంతంగా తీసుకెళుతున్న 29 ఏళ్ల యువకుడు. వారి వెనకే మౌనంగా నడుచుకుంటూ వెళుతున్న ఓ జంట.. ఇదంతా ఏదైనా సినిమాలో దృశ్యం అనుకుంటే మనం పొరబడ్డట్టే. కర్ణాటకలో ఇటీవల జరిగిన బాల్య వివాహం తాలూకు భయానక దృశ్యాలు. పూర్తి వివరాల్లోకి వెళితే.. హొసూర్ జిల్లా తిమ్మతూర్ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక స్థానికంగా ఉన్న పాఠశాలలో 7వ తరగతితోనే చదువు ఆపేసింది. ఇంటిపట్టునే ఉంటున్న ఆమెకు కుటుంబసభ్యులు తమ బంధువు అయిన 29 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి బలవంతంగా పెళ్లి చేశారు. మార్చి 3న బెంగళూరులో ఈ పెళ్లి జరిగింది. కానీ చిన్నారి మాత్రం తొలి నుంచి ఈ పెళ్లికి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇక వివాహం అనంతరం చిన్నారిని కుటుంబసభ్యులు తమ ఇంటికి తీసుకొచ్చారు. భర్తతో పాటు వెళ్లడం ఇష్టం లేని బాలిక అక్కడి నుంచి తప్పించుకుని తన అమ్మమ్మ ఇంటికి పారిపోయింది. అయితే, ఒకరోజు భర్త, ఆమె బంధువు బాలికను భుజాన వేసుకుని తమతో పాటు తీసుకెళ్లారు. వారి వెంటనే మరో జంట కూడా వెళ్లింది. ఇందుకు సంబంధించిన దారుణ దృశ్యాలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపాయి. మరోవైపు బాలిక అమ్మమ్మ నుంచి ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలిక తల్లి, చిన్నారిని బలవంతంగా వివాహం చేసుకున్న వ్యక్తి, అతడి మేనమామపై బాల్య వివాహ చట్టం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. “బాల్య వివాహ చట్టం, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశాము. బాలికను ప్రశ్నిస్తున్నాము. ఆ తరువాత ఆమెకు భద్రత కల్పించేందుకు వన్ స్టాప్ సెంటర్‌కు తరలిస్తాము” అని జిల్లా ఎస్పీ పీ. తంగదురై పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిక తన అమ్మమ్మ తాతయ్యల వద్ద ఉన్నది. బాల్యవివాహాల నిరోధక చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు జరిపించడం నేరం. అటువంటి వివాహాలు చెల్లవు. ఇలాంటి పెళ్లిళ్లు చేసేవారు, ఘటనకు సంబంధించిన వారు, మైనర్‌ను పెళ్లి చేసుకున్న వారికి కఠిన శిక్షలు వేస్తారు. నిబంధనలు ఇంత కఠినంగా ఉన్నా కూడా రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్, ఝార్కండ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఏపీ ప్రాంతాల్లో బాల్యావివాహాలు వెలుగు చూస్తున్నాయి.

# సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు ఇద్దరు మహిళా జర్నలిస్టుల అరెస్ట్.. రిమాండ్

సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వ ప్రసాద్ మీడియాకు వివరించారు. నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తిడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించామని విశ్వ ప్రసాద్ అన్నారు. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను నిప్పుకోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఓ వ్యక్తిని ఉద్దేశ్యపూర్వకంగా ఇంటర్వ్యూ చేస్తూ రేవంత్ రెడ్డిని అసభ్యకర వ్యాఖ్యలతో దూషించేలా చేశారని పోలీసులు గుర్తించారు. ఆ వీడియో గత నెలలో రికార్డు చేసినా అసెంబ్లీ సమావేశాలకు రెండు రోజుల ముందు టెలికాస్ట్ చేశారని విశ్వప్రసాద్ తెలిపారు. ఈ వీడియోను నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో వైరల్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇన్సెటివ్స్ తీసుకుని మరీ ట్రోల్ చేస్తున్నట్లు తెలిపారు. కైలాష్ ఫిర్యాదు ఆధారంగా సెక్షన్ 67 ఐటీ యాక్ట్, 111బిఎన్ఎస్, 61(2), 353(2), 352 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

14 రోజుల రిమాండ్ : కేసు దర్యాప్తు చేసి పల్స్ టీవీ ఛానెల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశామని అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. మాదాపూర్‌లోని టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి 2 ల్యాప్ టాప్‌లు, 2 హార్డ్ డిస్క్‌లు, లోగో, రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేవతిపై గతంలో ఎల్బీనగర్, బంజారాహిల్స్‌లో కేసులు ఉన్నాయని వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# కీచక ఉపాధ్యాయుడికి బుద్ధి చెప్పిన పోలీసులు..

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధాయ్యుడు అరెస్టయిన ఘటన నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి)లో చోటు చేసుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు మనోహర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఉపాధ్యాయుడు మోహన్ రావు పరారీలో ఉండగా.. గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వీరిద్దరూ కలిసి కొన్ని నెలలుగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇష్టమొచ్చినట్లు తాకుతూ.. డబుల్ మీనింగ్ డైలాగులతో చిన్నారులను భయభ్రాంతులకు గురి చేశారు. వారి వేధింపులు తాళలేక ఫిబ్రవరి 4న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారంతా పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఇద్దరు టీచర్లతోనూ తీవ్ర వాగ్వాదానికి దిగారు. విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే హెచ్ఎమ్ మాత్రం వారిపై చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించిన బాధితులు కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఈవో.. ఉపాధ్యాయులు మోహన్ రావు, మనోహర్ రెడ్డి విద్యార్థినులతో తప్పుగా ప్రవర్తించారని నిర్ధారించారు. ఈ మేరకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎమ్తోపాటు టీచర్లిద్దరినీ సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు మనోహర్ రెడ్డిపై గతంలోనూ ఇలాంటి ఫిర్యాదులు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. పని చేసిన ప్రతి చోటా స్టూడెంట్స్‌తో ఇలానే ప్రవర్తించినట్లు సమాచారం. ఈ మేరకు పలువురు తల్లిదండ్రులు సైతం అతనిపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కాగా, తప్పుడు పనులు చేసి ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చారని పలువురు వారిపై మండిపడుతున్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని, మరోసారి ఇలాంటి ఘటనలకు ఎవ్వరూ పాల్పడకుండా తగిన బుద్ధి చెప్పాలని కోరుతున్నారు.

# అత్త, మరదలు, కూతుర్ని కాల్చి చంపి వ్యక్తి ఆత్మహత్య

భార్య వదిలేసి వెళ్లిన విషయాన్ని గ్రామస్థులు తరచూ ప్రస్తావించడం, పాఠశాలలో కూతురుని 'మీ అమ్మ ఏమైంది..?' అని తోటివిద్యార్థులు ప్రశ్నిస్తుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ వ్యక్తి కూతురు, అత్త, మరదల్ని తుపాకీతో కాల్చి చంపేశాడు. ఆ

తరువాత అదే తుపాకీతో తానూ కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో మరదలి భర్త బుల్లెట్ గాయాలతో బతికి బయటపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం చిక్కమగళూరు జిల్లాలో ఈ ఘటన జరిగింది. రత్నాకర్(40) అనే వ్యక్తి కడబగెరెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా రెండేళ్ల క్రితం ఆయనను భార్య వదిలి వెళ్లిపోయింది. రత్నాకర్, అతని కూతురు మౌల్యతో పాటు అతని అత్త జ్యోతి కూడా ఉంటున్నారు. కాగా, భార్య వెళ్లిపోయిన విషయం గురించి ఇటీవల గ్రామస్థులు తరచూ రత్నాకర్ వద్ద ప్రస్తావించారు. రత్నాకర్ తట్టుకోలేకపోయాడు. తనను మోసగించారని అత్త, మరదలు, ఆమె భర్తతో గొడవపడ్డాడు. నాటు తుపాకీతో అత్త జ్యోతి (50), కూతురు మౌల్య(6), మరదలు సింధు (24)ను కాల్చి చంపాడు. తర్వాత అదే తుపాకీతో రత్నాకర్ కాల్చేసుకున్నాడు.

# రూములో బంధించి.. చిత్రహింసలు పెట్టి..

## ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేసిన కిరాతకులు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో సభ్య సమాజం తలదించుకునే సంఘటన ఒకటి చోటుచేసుకుంది. ఓ ముగ్గురు కిరాతకులు.. ఇద్దరు బాలికలపై దాడికి పాల్పడ్డారు. వారిని చిత్రహింసలకు గురి చేశారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. ఉత్తరాఖండ్, బాగేశ్వర్ జిల్లా, ఖైబగాద్‌కు చెందిన 23 ఏళ్ల యోగేష్ గాడియ.. కాప్‌కట్‌కు లక్కీ కతాయత్, దీపక్‌లు ఇద్దరు అమ్మాయిలను కిడ్నాప్ చేశారు. వారిని కాప్‌కట్‌లోని ఓ ఇంటి గదిలో బంధించారు. ముగ్గురు కిరాతకులు కలిసి వారిని చిత్రహింసలు పెట్టారు. విచక్షణా రహితంగా కొట్టారు. వారు ఎంత ఏడ్చినా.. కొట్టొద్దని ప్రాధేయపడినా వాళ్లు వినలేదు. అంతటితో వారి పైశాచికత్వం తగ్గలేదు. బాలికలను కొడుతూ దాన్నంతా వీడియో తీశారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై స్పందించిన పోలీసులు .. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడానికి వెళ్లారు. పోలీసులు ఎదురుపడటంతో ఆ ముగ్గురు కారులో తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులపైకే దాడికి దిగారు. అయితే, ముగ్గురిలో యోగేష్ మాత్రమే పోలీసులకు చిక్కాడు. మిగిలిన వారు అక్కడినుంచి తప్పించుకుని పారిపోయారు.

పరారీలో ఉన్న ఇద్దరికోసం కూడా పోలీసులు అన్వేషిస్తున్నారు. పోలీసుల నుంచి తప్పించుకున్న ఆ ఇద్దరు కోర్టు ద్వారా ముందస్తు బెయిల్ తెచ్చుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారిపై నమోదైంది పోక్సో చట్టం కావటంతో బెయిల్ దొరికే అవకాశాలు కనిపించటం లేదు. ఇక, సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోపై నెటిజన్లు స్పందిస్తున్నారు. బాలికలపై దాడికి పాల్పడిన ముగ్గురిపై తీవ్ర స్థాయిలో ఫైర్ అవుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆడవాళ్లు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఊరికే వదిలేయకూడదంటూ మండిపడుతున్నారు.

# ఇద్దరు ప్రియురాళ్లతో కలిసి మాజీ ప్రియురాలి హత్య

## 'గాలి ఇంజెక్షన్' ఇచ్చి చంపిన నిందితుడు

ఓ యువతిని ఆమె మాజీ ప్రియుడు తన ఇద్దరు ప్రియురాళ్లతో కలిసి హత్య చేశాడు. వారు ఆమె రక్తనాళాల్లోకి ఖాళీ సిరంజీతో గాలిని ఇంజెక్ట్ చేసి చంపేశారు. మృతదేహాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఏర్కాడులో 20 అడుగుల లోతున్న లోయలో పడేశారు. ఈ కేసులో ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన అల్ఫియా, పెరంబూరు జిల్లా అరుణాచల గౌండర్ నగర్‌కు చెందిన హఫీజ్(32) 2023 నుంచి ప్రేమించుకున్నారు. మరోవైపు, హఫీజ్ చెన్నైలోని ఒక ఐటీ కంపెనీలో పనిచేసే కావ్య సుల్తానా (22) అనే యువతితోనూ సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ విషయం తెలిసిన అల్ఫియా.. హఫీజ్‌ను నిలదీసింది. తనను కాకుండా మరొకరిని పెళ్లి చేసుకుంటే అతడి కుటుంబాన్ని అంతం చేస్తానని హెచ్చరించింది. దీంతో హఫీజ్ తన ప్రియురాలు కావ్యతో కలిసి అల్ఫియాను హత్య చేయాలని ప్లాన్ చేశాడు. ఒకవైపు కావ్యతో ప్రేమాయణం కొనసాగిస్తూనే, హఫీజ్ మోనీషా అనే మరో యువతినీ ప్రేమించాడు. ఈమెకు కూడా తన తొలి ప్రియురాలి కథ చెప్పి, ఆమెను హత్య చేసేలా పురిగొల్పాడు. ముందస్తు ప్లాన్ ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఇటీవల సేలంకు వచ్చి, అద్దె కారులో అల్ఫియాను తీసుకుని ఏర్కాడుకు వెళ్లారు. అక్కడ 60 అడుగుల వంతెన వద్ద హఫీజ్ వాహనాన్ని ఆపాడు. ఆ తర్వాత కావ్య, హఫీజ్‌లు సుల్తానాను గట్టిగా పట్టుకోగా, మోనిషా ఖాళీ సిరంజీలతో పదేపదే సుల్తానా రక్తనాళాల్లోకి గాలిని ఎక్కించడంతో రక్తప్రసరణ ఆగిపోయి ప్రాణాలు విడిచింది.

ఆ తర్వాత మృతదేహాన్ని ఓ లోయలోకి విసిరేసి ఏమీ తెలియనట్లు వెళ్లిపోయారు.

# ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజా భయ్యాపై గృహహింస కేసు

ఉత్తరప్రదేశ్‌లోని కుందా నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురాజ్ ప్రతాప్ సింగ్ అలియాస్ రాజా భయ్యాపై గృహహింస కింద కేసు నమోదైంది. ఆయన భార్య భన్వి సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఎంక్లేవ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. రాజాభయ్యా చాలాకాలంగా తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని, ఇప్పుడు తన ప్రాణాలకు ముప్పు ఉందనే భయాలున్నాయని తన ఫిర్యాదులో భన్విసింగ్ పేర్కొన్నారు. అత్తమామలు సైతం తనను వేధిస్తున్నారని చెప్పారు. ఎన్ని వేధింపులు ఎదురైనా వివాహబంధాన్ని కాపాడుకునేందుకు తొలుత చట్టపరమైన చర్యలకు తాను దూరంగా ఉన్నానని, అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని తెలిపారు. బన్వి సింగ్ గతంలోనూ ఇవే ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్, ఢిల్లీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అధారిటీని ఆశ్రయించారు. రాజ్యభయ్యా ముష్టై ఏళ్లుగా గృహహింసకు పాల్పడుతున్నారంటూ 2023 ఆగస్టులో ఆమె ఒక అఫిడవిట్‌ను ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసినట్టు కూడా చెబుతున్నారు. కాగా, రాజా భయ్యా కుందా నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు, బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వాల్లో మంత్రిగా కూడా పనిచేశారు. 2018లో జనసత్తా దల్ లోక్‌తాంత్రిక్ పార్టీని స్థాపించారు.

# రుయా సెంట్రల్ ల్యాబ్‌లో లైంగిక వేధింపులు

రుయా సెంట్రల్ ల్యాబ్‌లో లైంగిక వేధింపులు కలకలం రేపాయి. పారా మెడికల్ విద్యార్థినులను  ఇద్దరు ల్యాబ్ టెక్నిషియన్లు లైంగికంగా వేధించారని 20 మంది పారా మెడికల్ విద్యార్థినులు రాతపూర్వకంగా సూపరింటెండెంటుకు ఫిర్యాదు చేసారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటపతి, రాజశేఖర్‌ను ఆర్థోపెడిక్ ఓపీ విభాగానికి బదిలీ చేశారు. సమగ్ర విచారణ నిమిత్తం నలుగురు సభ్యులతో కమిటీని నియమించారు. ఈ కమిటీ దర్యాప్తు జరిపి నివేదిక ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా లైగింక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ నేత జగన్నాథం డిమాండ్ చేశారు. గతంలో ఎక్స్‌రే విభాగంలో ఇలాగే వేధింపులు జరిగినా

చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు లైంగిక వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని హిందూపురం అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి లలితాలక్ష్మీ హారిక కోట సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, బాల్యవివాహాల నిరోధంపై ఇటీవల న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో న్యాయమూర్తితో పాటు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా మంచి స్పర్శ, చెడు స్పర్శలపై ఆడపిల్లలకు సరైన అవగాహన కల్పించాలన్నారు. లైంగిక వేధింపులకు గురి చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. ఇలాంటి విషయాల్లో దాపరికాలు లేకుండా పిల్లలు తెలియజేసే విధంగా చూడాలన్నారు. అదే విధంగా రాజ్యాంగం నిర్దేశించిన వయసు మేరకే తల్లిదండ్రులు అమ్మాయిలకు వివాహం చేయాలన్నారు. అమ్మాయిలు సమాజంలో ఎదురవుతున్న సమస్యలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకువస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు.

# అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

## తల్లికి ఫోన్‌లో చెప్పి అఘాయిత్యం

అత్తింటి వారి వేధింపులు తాళలేక డబీర్‌పురలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. చనిపోయే ముందు తన తల్లికి ఫోన్ చేసిన ఆ మహిళ.. 'అమ్మా ఇక నా వల్ల కాదు, నేను చనిపోతున్నా' అని చెప్పి ఓ ఫ్లైఓవర్‌పై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటనలో వివాహిత తహనజర్‌బేగం మరణించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కాలడేరా ప్రాంతానికి చెందిన తహనజర్ బేగంకు నాగబౌలి ప్రాంతానికి చెందిన మిర్జా మొజాం అలీబేగ్ అలియాస్ అమీర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే, భర్త, అత్త, ఆడపడుచు, తోటి కోడళ్లు తహనజర్ బేగంను కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నారు. తహనజర్‌బేగం తన సమస్యను తల్లికి పలుమార్లు చెప్పగా ఆమె సర్దిచెబుతూ వస్తోంది. ఈ క్రమంలో ఒకరోజు ఇంట్లో గొడవ జరగ్గా.. కుటుంబసభ్యుల

వేధింపులు భరించలేకపోయిన తహనజర్‌బేగం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. డబీర్‌పుర ఫ్లైఓవర్‌పైకి వచ్చి తల్లికి ఫోన్ చేసి తన నిర్ణయాన్ని వివరించింది. తల్లి వద్దని వారిస్తున్నా వినకుండా ఫోన్ కట్ చేసి బ్రిడ్జిపై నుంచి దూకి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కేసు నమోదు చేసిన డబీర్‌పుర పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ప్లాస్టిక్ డబ్బాల్లో మృత శిశువుతో పాటు మనుషుల శరీర భాగాలు

మహారాష్ట్రలోని పుణె జిల్లాలో చెత్తలో ఓ మృత శిశువు దేహం వెలుగు చూసింది. అది కూడా ప్లాస్టిక్ డబ్బాలో ఆ మృతదేహం బయటపడింది. బోరావాకే సిటీలోని జిజామాత నగర్ కాలువ పక్కన ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళుతున్నాడు. అతడికి ఓ ప్లాస్టిక్ డబ్బాలో వింత ఆకారం కనిపించింది. అదేంటా అని పరీక్షగా చూశాడు. మృత శిశువు అని తెలియగానే షాక్ అయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ పడిఉన్న డబ్బాలను వెతికారు. కేవలం మృత శిశువు దేహమే కాదు.. మనుషులకు సంబంధించిన ఇతర శరీర భాగాలు కూడా లభించాయి. వాటన్నింటినీ ప్లాస్టిక్ డబ్బాల్లో పెట్టి చెత్తలో పడేశారు. పోలీసులు ఆ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసు అధికారి మాట్లాడుతూ.. 'ఉదయం 9.30 గంటల ప్రాంతంలో మాకు సమాచారం వచ్చింది. మగ శిశువు బాడీతో పాటు మనుషులకు సంబంధించిన మరికొన్ని శరీరభాగాలు కూడా దొరికాయి. వాటిని వైద్య పరీక్షలకు పంపాము. ఆ శరీర భాగాలు పలు రోగాల కారణంగా బాధపడుతున్న వారివిగా తేలింది. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిన తర్వాత ఆ భాగాన్ని తీసేసి, ప్లాస్టిక్ డబ్బాల్లో పెట్టి పడేశారు. రోగుల శరీరంనుంచి తీసేసిన భాగాలను డబ్బాల్లో పెట్టి పడేశారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపాము. శిశువును చంపేశారా? లేదా అది మెడికల్ వేస్టా అన్న కోణంలో ఆరా తీస్తున్నాము. పోస్టు మార్టం రిపోర్టు వచ్చిన తర్వాత శిశు వు ఎలా చనిపోయాడో తెలుస్తుంది. దాన్ని బట్టి కేసు దర్యాప్తు చేస్తాం' అని అన్నారు. ప్రస్తుతం సంఘటనా స్థలానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంఘటనా స్థలంలో 10 నుంచి 12 వరకు శిశువుల మృతదేహాలు దొరికినట్లు

ప్రచారం జరుగుతోంది. అయితే, అది అవాస్తవం అని తేలింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం సంఘటనా స్థలంలో ఒక శిశువు మృతదేహం మాత్రమే దొరికింది. మిగిలినవన్నీ మనుషుల శరీర భాగాలు మాత్రమే.

# గవర్నమెంట్ టీచర్లే టార్గెట్ 8 మందిని పెళ్లి చేసుకున్న కేటుగాడు రూ.కోట్లతో పరారీ

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ వ్యక్తి నిత్య పెళ్లికొడుకు అవతారం ఎత్తాడు. ఏకంగా 8 మంది ప్రభుత్వ మహిళా టీచర్లను పెళ్లి చేసుకుని మోసం చేశాడు. వారిలో ఎక్కువ మందిని భారీ మొత్తంలో బ్యాంకు రుణాలు తీసుకునేలా ప్రేరేపించి, ఆ డబ్బుతో పారిపోయాడు. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు సంపాదించాడు. నిత్య పెళ్లి కొడుకు చేతిలో మోసపోయిన ఇద్దరు ప్రభుత్వ మహిళా టీచర్లు సోన్ భద్ర పోలీసులను ఆశ్రయించారు. రాజన్ గహ్లోత్ అనే వ్యక్తి తమను మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమతో పాటు మరో ఆరుగురు ఇతర మహిళలను వివాహం చేసుకుని, వారి దగ్గర డబ్బుతో పారిపోయాడని మహిళలు ఆరోపించారు. 2014లో ఆన్‌లైన్ వివాహ పోర్టల్ ద్వారా తనకు గహ్లోత్ పరిచయం అయ్యాడని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయురాలు పోలీసులకు చెప్పారు. "గహ్లోత్ తనను తాను ప్రభుత్వ ఉద్యోగిగా పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరం వివాహం చేసుకున్నాం. మెల్లగా తనపై నాకు నమ్మకం కలిగేటట్లు చేశాడు. 2016లో కొంత భూమి కొని ఇల్లు కట్టుకుందామన్నాడు. రూ.40 లక్షల బ్యాంకు రుణం తీసుకోవాలని నన్ను ఒత్తిడి చేశాడు. లోన్ అమౌంట్ అందిన వెంటనే పరారయ్యాడు. 2020లో అంబేద్కర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశా" అని మహిళా టీచర్ వ్యాఖ్యానించారు. మోసగాడు 2019లో తనను కలిశాడని మరో మహిళ టీచర్ పోలీసులకు చెప్పుకొచ్చారు. తనను తాను ఎక్సైజ్ శాఖ అధికారిగా పరిచయం చేసుకున్నాడని తెలిపారు. అతని ఉచ్చులో పడి వివాహం చేసుకున్నానని పేర్కొన్నారు. 2022లో ఇల్లు కట్టుకోవడానికి రూ.42 లక్షలు లోన్ తీసుకునేటట్లు చేశాడని, ఆ నగదుతో పరారయ్యాడని వెల్లడించారు. కాగా, ఆమెకు ఒక

మగబిడ్డ కూడా ఉన్నాడు.

### పరారీలో నిందితుడు- పోలీసులు గాలింపు

అంబేడ్కర్ నగర్, సంత్ కబీర్ నగర్, గోరఖ్‌పుర్, వారణాసి, సోన్‌భద్రకు చెందిన ప్రభుత్వ మహిళా టీచర్లను నిందితుడు మోసగించాడు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నిందితుడు రాజన్ గహ్లోత్‌పై కేసు నమోదు చేసినట్లు సోన్?భద్ర అదనపు ఎస్పీ కల్లూ సింగ్ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

## భార్య రీల్స్ పిచ్చి.. భర్త ఉద్యోగం ఊస్ట్

పోలీసు అధికారి భార్య ఒకరు.. నడి రోడ్డు మీద డ్యాన్స్ చేస్తూ.. వాహనదారులకు ఇబ్బంది కలిగించిన వీడియో ఒకటి రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. చండీగఢ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ వీడియో కాస్త వైరల్ కావడంతో.. దీనిపై పెద్ద ఎత్తున్న ఆగ్రహం వ్యక్తం అయ్యింది. విషయం కాస్త ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో.. వారు దీనిపై స్పందించి.. సదరు పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. అజయ్ కుందు అనే వ్యక్తి సెక్టార్ 19 పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల అనగా మార్చి 22న అజయ్ భార్య జ్యోతి కుందు తన ఇన్‌స్టాలో ఓ డ్యాన్స్ వీడియోని షేర్ చేసింది. అది కాస్త వైరల్ కావడంతో.. ఉన్నతాధికారులు అజయ్‌ని సస్పెండ్ చేశారు. భార్య డ్యాన్స్ చేస్తే భర్తపై చర్యలు తీసుకుంటారా.. ఇదెక్కడి విడ్డూరం అనుకుంటున్నారా.. అక్కడే ఉంది అసలు ట్విస్ట్. నా భర్త పోలీసు అధికారి.. ఇక నన్ను ఆపేదేవరు అని భావించిన జ్యోతి.. నడి రోడ్డు మీద.. వాహనాలను ఆపి మరి డ్యాన్స్ చేస్తూ.. వీడియో తీసుకుంది. ఆమె వీడియో రికార్డింగ్ పూర్తయ్యేవరకు.. వాహనదారులు అలానే నిలిచిపోయారు. దాంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జ్యోతితో పాటు ఆమె మరదలు కూడా ఉంది. వీరి చేష్టలతో విసిగిపోయిన ఓ వ్యక్తి.. పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఇద్దరు తమ డ్యాన్స్ వీడియో కోసం వాహనాలు ఆపి.. ట్రాఫిక్ జామ్ అయ్యేలా చేయడమే కాక.. రోడ్డు మీద ఉన్న వాళ్ల అనుమతి లేకుండానే.. వారిని వీడియో, ఫొటోలు తీసి.. వారి వ్యక్తిగత జీవితానికి ఆటంకం కలిగించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా.. జ్యోతి చేసిన ఘనకార్యం వెలుగులోకి వచ్చింది. దాంతో పోలీసులు ఆమె మీద అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అంతేకాక జ్యోతి భర్త.. అజయ్‌ను సస్పెండ్ చేశారు.

# వారణాసిలో యువతిపై సామూహిక అత్యాచారం

## ప్రధాని మోదీ ఆరా.. కఠిన చర్యలకు ఆదేశం

వారణాసిలో 19 ఏళ్ల యువతిపై జరిగిన సామూహిక అత్యాచారంపై ప్రధాని నరేంద్ర మోదీ కఠినమైన చర్యలకు ఆదేశించారు. మోదీ తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడానికి వచ్చిన సందర్భంలో విమానం దిగిన వెంటనే అత్యాచార ఘటనపై ఆరాతీశారు. ఘటన గురించి అధికారులు ప్రధానికి వివరించారు. నగర పోలీసు కమిషనర్, డివిజనల్ కమిషనర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ప్రధాని నరేంద్ర మోదీకి పూర్తి వివరాలు వెల్లడించారు. నిందితులపై సాధ్యమైనంత త్వరగా కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రధాని ఆదేశించారు. ఇలా ఉండగా, వారణాసిలో 19 ఏళ్ల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో ఇప్పటి వరకూ తొమ్మిది మందిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వరుణ జోన్ డీసీపీ చంద్రకాంత్ మీనా



కథనం ప్రకారం.. ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోన్న యువతి.. స్పోర్ట్స్ కోర్సులో చేరాలని భావించింది. ఆ క్రమంలో యూపీ కాలేజీకి ప్రతి రోజు వెళ్లి.. రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తోంది. అయితే మార్చి 29వ తేదీన స్థానిక పిషాచ్‌మోచన్ ప్రాంతంలోని హుక్కా బార్‌కు ఆమెను ఓ స్నేహితుడు తీసుకు వెళ్లాడు. అక్కడ వీరితో మరికొంత మంది యువకులు కలిశారు. అనంతరం ఆ యువతకి మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చారు. ఆ డ్రింక్ తాగిన ఆమె మత్తులోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత సిగ్రా ప్రాంతంలోని పలు హోటళ్లకు ఆ యువతిని తిప్పితూ.. గ్యాంగ్ రేప్‌కు పాల్పడినట్లు తెలిపారు. ఈ విధంగా మార్చి 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆమెపై గ్యాంగ్ రేప్ చేశారని వివరించారు. ఆ తర్వాత సదరు యువతి ఇంటికి చేరుకొని.. జరిగిన దారుణాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో లాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా హుక్కా బార్‌లోని సీసీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు.

బాధితురాలి తండ్రి చెబుతున్న వివరాల ప్రకారం, "నా కుమార్తె మార్చి 29న తన స్నేహితుడ్ని కలవడానికి ఇంటి నుండి బయలుదేరింది. మూడు నాలుగు రోజులైనా ఆమె ఇంటికి రాకపోవడంతో భయపడి, ఆమె కోసం చాలా చోట్ల గాలించాం. కానీ ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో ఏప్రిల్ 3న పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఏప్రిల్ 4న ఆమెను పోలీసులు కనుగొన్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స అనంతరం ఆమె సాధారణ స్థితికి చేరుకుని జరిగినదంతా వివరించింది," అని బాలిక తండ్రి చెప్పారు. "నా కుమార్తె ఇంటర్మీడియట్‌లో కామర్స్ చదివింది. ఆమెకు స్పోర్ట్స్ అంటే ఇష్టం. ఆమెకు పంతొమ్మిదేళ్లు. ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన వాళ్లెవరూ నాకు తెలీదు. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇటువంటి వాళ్లకి బుద్ధి చెప్పడంలో దిట్ట. మాకు న్యాయం చేయాలని సీఎంను కోరుతున్నాను. నిందితుడిని ఉరితీయాలని నేను డిమాండ్ చేయను, కానీ శిక్ష చాలా తీవ్రంగా ఉండాలి, భవిష్యత్ లో ఇలాంటి తప్పులు చేయకుండా వాళ్లకి తగిన శాస్తి చేయాలి." అన్నారు. కాగా, నిందితుల్ని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చారు. 11 మందిని బాధితురాలు గుర్తుపట్టలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, "యువతిని ప్రలోభపెట్టి తీసుకెళ్లి చాలా రోజుల పాటు అత్యాచారం చేశారు. 7 రోజుల వ్యవధిలో 23 మంది తనపై అత్యాచారం చేశారని బాధితురాలు ఆరోపించింది. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నాం. "ఆమెను చాలా మంది మద్యం తాగించి, సామూహిక అత్యాచారం చేశారు. చాలా మంది పాల్గొనడం అంటే అది ప్రీ ప్లాన్డ్ నేరమని అర్థమవుతోంది." అని పోలీసులు చెబుతున్నారు.

# ఏడుగురి ఉసురు తీసిన నకిలీ కార్డియాలజిస్టు

## ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందం దర్యాప్తు

మధ్యప్రదేశ్‌లో దామోహ్ నగరంలో మిషనరీ ఆసుపత్రిలో నకిలీ కార్డియాలజిస్ట్ రోగులకు శస్త్ర చికిత్స చేయడం ద్వారా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జాతీయ మనవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టనుంది. అందుకోసం ఏప్రిల్ 7 నుంచి 9వ తేదీ మధ్య దామోస్ నగరంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుల బృందం పర్యటించనుంది. ఈ బృందానికి ఆ కమిషన్‌లోని సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వం వహించనున్నారు. దామోస్‌లోని మిషనరీస్ ఆసుపత్రిలో గుండె సమస్యలతో పలువురు రోగులు చేరారు. వారికి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్ జాన్ కామ్ శస్త్ర చికిత్స నిర్వహించారు. అయితే వారు మరణించారు. ఈ నేపథ్యంలో జబల్పూర్‌కు చెందిన దీపక్ తివారీ.. ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్ ఎన్ జాన్ కామ్ అనే వైద్యుడు శస్త్ర చికిత్స నిర్వహించడం వల్ల ఏడుగురు మరణించారని ఫిర్యాదు చేశారు. అయితే సదరు వైద్యుడు.. తనకు అన్ని విదేశీ అర్హతలు ఉన్నాయని చెబుతున్నారంటూ ఆ ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ జరపనుంది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. తన ఎక్స్ ఖాతా వేదికగా స్పష్టం చేసింది. మరోవైపు ఏప్రిల్ 7 నుంచి 9 వ తేదీ వరకు తమ బృందం దామోహ్‌లోనే ఉంటుందని.. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయాలనుకేవారు.. చేయ వచ్చని ప్రజలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ తన ఎక్స్ ఖాతా వేదికగా సూచించింది. ఇంకోవైపు ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనిపై నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుధీర్ కొచ్చర్ స్పష్టం చేశారు. అదీకాక డాక్టర్ ఎన్ జాన్ కామ్ అనే పేరుతో చెలమణి అవుతున్న వ్యక్తి అసలు పేరు విక్రమాదిత్య యాదవ్ అని ఓ చర్చ సైతం స్థానికంగా కొనసాగుతోంది.

# బాలుడిని చెట్టుకు కట్టి... ఎర్రచీమలు వదిలి...

## దావణగెరె జిల్లాలో ఘటన.. 9మందిపై కేసు

చోరీ చేశాడని, అసభ్యంగా ప్రవర్తించాడని ఓ బాలుడిని వక్కచెట్టుకు కట్టి, డ్రిప్ పైపులతో దాడి చేశారు. మర్మాంగం వద్ద ఎర్రచీమలను విడిచి హింసించారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరె జిల్లాలో ఈ అమానుష సంఘటన చోటుచేసుకుంది. నల్లూరు పరిధిలోని హస్తాపనహళ్లి గ్రామంలో సంచార జాతులకు చెందిన బాలుడిపై అదే సామాజికవర్గానికి చెందిన యువకులు ఈ దాడికి పాల్పడ్డారు. ఇలా బాలుడిపై దాడి చేస్తున్న వీడియోలను తీసుకున్నారు. వీరంతా వనమూలికలు అమ్మి జీవనం సాగించేవారని చన్నగిరి పోలీసులు తెలిపారు. రెండురోజుల అనంతరం ఈ ఘటన వెలుగు చూసింది. బాలుడిని చిత్రహింసలకు గురిచేసిన వీడియో వైరల్ అయింది. బాలుడి తాత ఫిర్యాదుతో దావణగెరె జిల్లా చన్నగిరి పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. సుభాష్ (23), దర్శన్ (22), పరశు(25), లక్కి(21), శివదర్శన్ (23), హరీశ్ (25), పట్టిరాజు(20), భూని(18), మధుసూదన్ (32)పై కేసు నమోదుకాగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గర్భిణీ ప్రసవం

## మానవత్వం చాటుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

రైల్వే స్టేషన్‌లో పురిటినొప్పులతో బాధ పడుతున్న ఓ గర్భిణికి ఆర్పీఎఫ్ సిబ్బంది సాయం చేసి పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. త్వరితగతిన స్పందించిన ఆర్పీఎఫ్ సిబ్బందికి ఆ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మహొజీ అనే మహిళ తన భర్తతో కలిసి దుండిగల్‌లో నివాసం ఉంటోంది. విశాఖపట్నం వెళ్లేందుకు తన భర్తతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ఆమె చేరుకుంది. ఈ క్రమంలోనే ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ ఎస్ఐ మహేశ్ వెంటనే అత్యవసర చికిత్స విభాగానికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి హుటాహుటిన చేరుకున్న 108 సిబ్బంది పరిస్థితిని గమనించి గర్భిణీకి అక్కడే ప్రసవం చేశారు. ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు ఒక పరదాతో ఆమెకు రక్షణ కవచంలా నిలిచి సురక్షిత ప్రసవానికి సహకరించారు. తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగా

ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. త్వరితగతిన స్పందించిన ఆర్పీఎఫ్ సిబ్బందికి వారు ధన్యవాదాలు తెలిపారు. మహౌజీ దుండిగల్‌లో ఇటుక బట్టీల వద్ద పని చేస్తున్నట్లు తెలిసింది.

## కారు యాక్సిడెంట్.. గుడిసెలో ఉన్న గర్భిణికి సుఖ ప్రసవం

ఓ కారు కారణంగా గర్భిణి సుఖంగా ప్రసవించింది. అయితే.. ఈ సంఘటనలో గర్భిణితో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారందరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పసికందు తల్లి పరిస్థితి విషమంగా ఉంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఓ గర్భిణి స్లమ్‌లోని ఓ పూరి గుడిసెలో నివసిస్తోంది. ఆమె పూరి గుడిసె బ్రిడ్జికిందే ఉంది. రాత్రి 11.30 గంటల సమయంలో ఓ కారు వేగంగా ఆ బ్రిడ్జి మీద వెళుతూ ఉంది. ఈ నేపథ్యంలోనే అదుపు తప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడింది. నేరుగా గర్భిణి నివసిస్తున్న గుడిసెపై పడింది. 50 అడుగుల పైనుంచి గుడిసెపై పడింది. ఆ సమయంలో గర్భిణితో పాటు మరో ముగ్గురు కూడా అందులో ఉన్నారు. వారందరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. గర్భిణి కూడా గాయపడింది. ఆమె అక్కడే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గాయపడ్డ వీరిని హుటాహుటిన దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పాప క్షేమంగా ఉన్నట్లు తేలింది. అయితే.. గర్భిణి పరిస్థితి మాత్రం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ కారు జువేద్ ఖాన్ అనే వ్యక్తి పై రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది.

## మేడ్చల్‌లో యువతిపై కీచకుల అఘాయిత్యం

మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. యువతిపై దుండగులు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. కానీ యువతి మాత్రం భయపడిపోకుండా తనను తాను రక్షించుకునేందుకు కీచకులతో పోరాడింది. ఇటీవల ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచార ఘటన మరువక ముందు మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో అలాంటి ఘటనే చోటు చేసుకుంది. ఓ యువతిపై దుండగులు అత్యాచారానికి యత్నించారు. అయితే యువతి ప్రతిఘటించడంతో అక్కడ నుంచి వారు పరుగులు తీశారు. మేడ్చల్ రైల్వే స్టేషన్ పరిధిలో ఓ యువతి ఒంటరిగా వెళ్తుండగా ఆమెను అడ్డుకున్నారు కీచకులు. యువతిను

బలవంతం చేసేందుకు ప్రయత్నించారు. అయితే యువతి కూడా ఎక్కడా తగ్గకుండా వారితో ధైర్యంగా పోరాడింది. కామాంధుల నుంచి తనను తాను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఒక్కసారిగా దుండగులు మీదకు రావడంతో వారిని అడ్డుకునేందుకు అక్కడే ఉన్న రాళ్లతో దాడి చేసి తప్పించు కునేందుకు ప్రయత్నించింది.




అయినప్పటికీ వారు వెంటపడటంతో తీవ్రస్థాయిలో ప్రతిఘటించింది యువతి. చివరకు ఆ దుండగుల భారి నుంచి ఎలాగోలా తప్పించుకుని వెంటనే మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. పీఎస్‌లో దుండుగులు ఏ విధంగా ఇబ్బందులకు గురిచేశారు.. తాను ఎలా తప్పించుకుందో పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటన మేడ్చల్ రైల్వేస్టేషన్ పరిధిలో జరగడంతో ఈ కేసును రైల్వే పోలీసులకు ట్రాన్సఫర్ చేశారు మేడ్చల్ పోలీసులు. ఈ మధ్య కాలంలో రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయంటూ పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

కొంతమంది గంజాయి తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గంజాయి మత్తులో ప్రయాణికుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి నేపథ్యంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భద్రత పెంచాలంటూ పలు డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు తాజాగా మేడ్చల్‌లో జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేయగా.. వారు కేసును విచారణ జరుపుతున్నారు. కీచకులతో ప్రతిఘటిస్తున్న సమయంలో యువతికి కూడా కొంతమేర గాయాలు అవడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# ఇజ్రాయెల్ టూరిస్ట్, మరో మహిళపై గ్యాంగ్ రేప్

ఇజ్రాయెల్‌కు చెందిన 27 ఏళ్ల యువతితో పాటు ఆమెతో ఉన్న హోమ్‌స్టే యజమానిపై ముగ్గురు దుండగులు సామూహిక అత్యాచారం చేశారు. వారితో పాటు వచ్చిన మరో ముగ్గురు పర్యటకులను కాలువలోకి నెట్టేశారు. అందులో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మూడో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఘటన కర్ణాటకలోని కొప్పళ జిల్లా గంగావతిలో జరిగింది. ఫిర్యాదులో హోం స్టే ఆపరేటర్ తెలిపిన వివరాల ప్రకారం- ఇజ్రాయెల్ యువతి, అమెరికాకు చెందిన డేనియల్, నాసిక్‌కు చెందిన పంకజ్, ఒడిశాకు చెందిన డిబాస్ ఆనెగుందిలోని అంబికా నాయక్ హోంస్టేలో బసచేశారు. గురువారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో వీరంతా సణాపుర చెరువు సమీపంలోని రంగాపుర గంగమ్మ గుడివద్ద సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ముగ్గురు దుండగులు మోటార్ సైకిల్‌పై వచ్చి పెట్రోల్ ఎక్కడ దొరుకుతుందని హోం స్టే



ఆపరేటర్‌ను అడిగారు. దగ్గర్లో ఎక్కడా పెట్రోల్ పంప్ లేదని ఆమె సమాధానం చెప్పింది. సనాపుర్ నుంచి తెచ్చుకోవచ్చని తెలిపింది. అనంతరం నిందితులు ఆమెను రూ.100 అడిగారు. వారెవరరో హోం స్టే ఆపరేటర్‌కు తెలియనందున తన వద్ద డబ్బులు లేవని చెప్పింది. అయినా వినని దండుగులు డబ్బులు ఇవ్వమని పట్టుబట్టారు. ఇంతలో ఒడిశాకు చెందిన టూరిస్ట్ నిందితులకు రూ.20 ఇచ్చాడు. ఆ తర్వాత కూడా నిందితులు టూరిస్టులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం రాళ్లతో తల పగులగొడతామని బెదిరించారు. డబ్బులు ఇవ్వడానికి టూరిస్ట్ బృందం నిరాకరించేసరికి, కన్నడ-తెలుగు మాట్లాడే ఓ నిందితుడు దుర్భాషలాడాడు. అనంతరం హోం స్టే ఆపరేటర్, ఇజ్రాయెలీ టూరిస్ట్‌పై నిందితులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ముగ్గురు పురుష టూరిస్టులను కాలువలోకి తోసేశారు. ఘటన జరిగిన తర్వాత నిందితులు మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. తనను ఒక నిందితుడు పక్కకు లాగి, దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని ఎఫ్ఐఆర్‌లో బాధితురాలు హోం స్టే ఆపరేటర్ పేర్కొంది. మరో ఇద్దరు అత్యాచారం చేశారని చెప్పింది.

అంతేకాకుండా తన బ్యాగు, రెండు మొబైల్ ఫోన్‌లు, రూ.9500 నగదు దొంగిలించారని తెలిపింది. ఇజ్రాయెలీ టూరిస్ట్‌పై కూడా అలాగే అత్యాచారానికి పాల్పడినట్లు చెప్పింది. డాగ్ స్క్వాడ్ సహా ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలించాయి. అక్కడ ఓ బైక్, హ్యాండ్ బ్యాగ్, కెమెరా, పవర్‌బ్యాంక్, పెన్, విరిగిన గిటార్, గ్లోవ్స్, సిగరెట్స్, రక్తంతో తడిచిన వస్త్రాలు దొరికినట్లు పోలీసులు తెలిపారు. కాలువలో పడిన పంకజ్, డేనియల్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. కానీ డిబాస్ నీటి ఉద్ధృతికి గల్లంతయ్యారు. అక్కడి నుంచి ఎలాగోలా తప్పించుకున్న ఓ మహిళ హోమ్‌స్టేకు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డవారిని గంగావతి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం గల్లంతైన బిబాష్ మృతదేహం లభ్యమైంది. నిందితులను పట్టుకునేందుకు ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. నిందితులను మల్లేశ్, చేతన్ సాయిగా గుర్తించారు. 21 సంవత్సరాల వయస్సు గల ఇద్దరూ గంగావతి పట్టణంలోని సాయి నగరానికి చెందినవారని, మేస్త్రీలుగా పనిచేస్తున్నారని పోలీసులు వెల్లడించారు.

# బస్సు వెనుక విద్యార్థిని పరుగులు.. డ్రైవర్ సస్పెన్షన్

చెన్నై: ఆగకుండా వెళ్లిన ప్రభుత్వ బస్సు వెనుక ప్లస్ టూ విద్యార్థిని పరుగులు తీస్తూ వెళ్లిన దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి బస్టాండ్ నుంచి మంగళవారం ఉదయం ఆలంగాయం వైపుకు ప్రభుత్వ బస్సు బయల్దేరింది. ఆ బస్సు కొత్తకోట బస్టాండ్ సమీపిస్తుండగా, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు వెళు తున్న ప్లస్ టూ విద్యార్థిని బస్సు ఆపాలంటూ చేతులు ఊపింది. కానీ, డ్రైవర్ బస్సు ఆపకుండా ముందుకు వెళ్లడంతో, దిగ్భ్రాంతికి గురైన విద్యార్థిని పరీక్షకు సకాలంలో హాజరుకాలేను అనే భయంతో బస్సు వెనుక పరుగులు తీసింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ బస్సును ఆపడంతో, సదరు విద్యార్థిని బస్సు ఎక్కింది. విద్యార్థిని బస్సు వెనుక వేగంగా పరుగులు తీస్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వెలువడింది. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (విల్లుపురం రీజియన్) మేనేజింగ్ డైరెక్టర్, పరీక్ష రాసేందుకు పాఠశాలకు వెళ్లేందుకు వేచి ఉన్న విద్యార్థిని బస్సులో ఎక్కించుకోని కారణంగా డ్రైవర్ మునిరాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



# భారత్‌లోనే అత్యధిక కాలుష్య నగరాలు!


## టాప్-20 సిటీల్లో 13 మనవే

ప్రపంచంలోని 20 అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే - అగ్రస్థానంలో మేఘాలయలోని బైర్నిహాట్ నగరం - అత్యంత కాలుష్య రాజధానిగా ప్రథమ స్థానంలో ఢిల్లీ : వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024 ప్రపంచంలోని 20 అత్యంత వాయు కాలుష్యం గల నగరాల్లో 13 భారతదేశంలోనే ఉన్నాయని, వాటిలో మేఘాలయలోని బైర్నిహాట్ అగ్రస్థానంలో ఉందని వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024 పేర్కొంది. అంతేకాదు ప్రపంచంలోని అత్యంత కలుషితమైన రాజధాని నగరాల్లో ఢిల్లీ ప్రథమ స్థానంలో ఉందని సదరు నివేదిక స్పష్టం చేసింది. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూఎయిర్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం, 2023లో భారత్ ప్రపంచంలోనే మూడో అత్యంత కాలుష్య దేశంగా ఉండగా, 2024 నాటికి కాస్త మెరుగుపడి ఐదో స్థానానికి చేరుకుంది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోని 4 నగరాలు, చైనాలోని ఒక నగరం కూడా ప్రపంచంలోని టాప్-20 కాలుష్య నగరాల జాబితాలో ఉన్నాయి. నివేదిక ప్రకారం, భారత్‌లో పీఎం2.5 సాంద్రత 2023లో క్యూబిక్ మీటర్‌కు 54.4 మైక్రోగ్రాములు ఉండగా, అది 2024లో 7 శాతం మేర తగ్గింది. అంటే సగటున క్యూబిక్ మీటర్‌కు 50.6 మైక్రోగ్రాములు తగ్గింది. అయినప్పటికీ ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారతదేశంలోనే ఉండడం గమనార్హం.

### ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యం!

నివేదిక ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరింతగా పెరుగుతోంది. 2023లో పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 102.4 మైక్రోగ్రాములు ఉండగా, అది 2024లో క్యూబిక్ మీటర్‌కు 108.3 మైక్రోగ్రాములకు పెరిగింది. ప్రపంచంలోని టాప్ 20 అత్యంత కాలుష్య నగరాల జాబితాలో మేఘాలయలోని బైర్నిహాట్, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లన్‌పుర్, ఫరీదాబాద్, లోని, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, బివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. మొత్తంగా చూసుకుంటే, దాదాపు 35

శాతం భారతీయ నగరాల్లో వార్షిక పీఎం2.5 సాంద్రత స్థాయిలు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పరిమితి కంటే 10 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 5 మైక్రోగ్రాముల కంటే తక్కువ ఉండాలి. కానీ భారత్‌లో ఈ పరిమితి కంటే 10 రెట్లు ఎక్కువగా పీఎం2.5 సాంద్రతలు ఉన్నాయి. మేఘాలయ-అసోం సరిహద్దుల్లోని బైర్నిహాట్ పట్టణంలో చాలా డిస్టిలరీలు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు ఉన్నాయి. వీటి నుంచి వెలువడే ఉద్గారాల వల్ల ఆ నగరం కాలుష్యకాసారం అవుతోంది. ఇక దేశ రాజధాని నగరమైన దిల్లీ ఏడాది పొడవునా అధిక వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. శీతాకాలంలో అయితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంటుంది. వాహన ఉద్గారాలకు తోడు, పంట వ్యర్థాలను తగులబెట్టడం, పటాకులు కాల్చడం సహా, ఫ్యాక్టరీల నుంచి వెలువడే ఉద్గారాలు దిల్లీలోని గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఈ వాయు కాలుష్యం వల్ల భారత్‌లో తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మానవుల ఆయుర్దాయం 5.2 సంవత్సరాలు తగ్గుతోందని అంచనా. గతేడాది ప్రచురించిన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ స్టడీ ప్రకారం, 2009-2019 మధ్యలో భారత్‌లో ఏటా దాదాపు 1.5 మిలియన్ మరణాలు పీఎం2.5 కాలుష్యం వల్లనే కలిగాయని తేలింది. పీఎం2.5 అంటే 2.5 మైక్రాన్ల కంటే చిన్నగా ఉండే కణాలు. సింపుల్‌గా చెప్పాలంటే వాయు కాలుష్య కణాలు. ఇవి ఊపిరితిత్తుల్లోకి, రక్తప్రవాహంలోని ప్రవేశించి దీర్ఘకాలిక శ్వాస సమస్యలు, గుండె జబ్బులకు, క్యాన్సర్ రావడానికి కారణమవుతాయి.



# కేంద్ర ప్రభుత్వ బాలికా శిశు పథకాలు

మన సమాజంలో బాలికలు మరియు మహిళల ఆర్థిక మరియు సామాజిక చేరికను నిర్ధారించడానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం బాలికల విద్యను ప్రోత్సహించే కార్యక్రమం. లింగ సమానత్వంపై అవగాహన పెంచడానికి మరియు విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు పోషకాహారంలో సమాన అవకాశాల కోసం భారతదేశం ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ దినోత్సవాన్ని పాటించడం ద్వారా, ప్రతి ఆడబిడ్డకు సమానత్వం మరియు గౌరవం యొక్క సూత్రాలను మరింత ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మన సమాజంలో బాలికలు మరియు మహిళల ఆర్థిక మరియు సామాజిక చేరికను నిర్ధారించడానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించింది.

## బేటీ బచావో బేటీ పఢావో

2015లో ప్రధాని నరేంద్ర మోదీచే ప్రారంభించబడింది, బేటీ బచావో బేటీ పఢావో (%బీబీబీూ%) పథకం లింగ ఆధారిత గర్భస్రావం మరియు తక్కువ లింగ నిష్పత్తి వంటి వారి సమస్యలను పరిష్కరించడం కోసం ఉద్దేశించబడింది. ఇది ఆడపిల్లల విద్య మరియు సాధికారతను కూడా ప్రోత్సహిస్తుంది.

## ఉడాన్ పథకం

ఉడాన్ పథకం ఇంజనీరింగ్ మరియు ఇతర కీలకమైన సాంకేతిక కోర్సులలో బాలికల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనిని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మరియు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ నిర్వహిస్తోంది.

## బాలికా సమృద్ధి

1997లో ప్రారంభించబడిన బాలికా సమృద్ధి యోజన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల నుండి ఆడపిల్లలకు మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన మరొక ప్రభుత్వ పథకం. ఆర్థిక సహాయంగా రూ. ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులకు 500 అందజేస్తారు. వార్షిక ప్రదానం రూ. 10వ తరగతి పూర్తి చేసే వరకు బాలికలకు 1,000 అందజేయబడుతుంది.




## సుకన్య సమృద్ధి యోజన

బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా, ఈ పథకం 10 ఏళ్లలోపు బాలికల తల్లిదండ్రులను వారి విద్య మరియు వివాహ ఖర్చుల కోసం పొదుపు చేయమని ప్రోత్సహిస్తుంది. సుకన్య సమృద్ధి యోజన బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి పొదుపు ఎంపికలతో అధిక వడ్డీ రేట్లను అందిస్తుంది. అదనంగా, స్కీమ్కు చేసే విరాళాలు పన్ను మినహాయింపులకు అర్హులు, ఇది తల్లిదండ్రులకు ఆకర్షణీయమైన పొదుపు ఎంపిక.

## బాలికా సమృద్ధి యోజన

1997లో ప్రారంభించబడింది, బాలికా సమృద్ధి యోజన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల నుండి ఆడపిల్లలకు ఆర్థిక సహాయం అందిస్తుంది. ఆర్థిక సహాయం రూ. 500 ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులకు అందజేస్తారు. ఇంకా, వార్షిక ప్రదానం రూ. 300 నుంచి రూ. 10వ తరగతి పూర్తయ్యే వరకు బాలికలకు 1,000 అందజేస్తారు. పాఠశాల విద్య %డ% అక్షరాస్యత విభాగం, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడుతున్న

## మాధ్యమిక విద్య బాలికలకు జాతీయ ప్రోత్సాహక పథకం

ఈ పథకం భారతదేశంలోని అణగారిన తరగతులకు చెందిన బాలికలకు సహాయం

చేయడానికి మరియు వారి మాధ్యమిక విద్యను పూర్తి చేయడానికి వీలు కల్పిస్తుంది. అర్హులైన బాలికకు రూ. పథకం కింద ఆమె తరగతి తరపున వచ్చిన ఫిక్స్డ్ డిపాజిట్గా 3000. ఆమె 18 ఏళ్ల వయస్సు తర్వాత మరియు 10వ సంవత్సరానికి ఉత్తీర్ణులైన తర్వాత ఈ డబ్బును వడ్డీతో విత్ డ్రా చేసుకోవచ్చు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం బాలికల విద్యను, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన వారి విద్యను ప్రోత్సహించడానికి ఒక చొరవ. ఇది మరియు మారుమూల ప్రాంతాల్లోని బాలికలకు రెసిడెన్షియల్ పాఠశాల సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాలను అందజేస్తుంది.

## సెకండరీ ఎడ్యుకేషన్ కోసం బాలికలకు జాతీయ ప్రోత్సాహక పథకం

బాలికలు సెకండరీ స్థాయిలో విద్యను కొనసాగించేలా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం. ఈ ప్రోత్సాహకం బాలికలందరికీ అందుబాటులో ఉంటుంది, అయితే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

## వాత్సల్య పథకం

ఇది 0 నుండి 18 సంవత్సరాలలోపు పిల్లలకు కొత్త పెన్షన్ పథకం. ఒక పేరెంట్ పై క్యాప్ లేకుండా నెలకు కనీసం రూ. 1000 డిపాజిట్ చేయవచ్చు. చిన్నారికి 18 ఏళ్లు వచ్చే వరకు ఖాతా తల్లిదండ్రులచే నిర్వహించబడుతుంది, ఆ తర్వాత అది పిల్లల పేరుకు బదిలీ చేయబడుతుంది మరియు వారిచే నిర్వహించబడుతుంది.

## మిషన్ పోషణ్ 2.0



ఈ పథకం పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాలను పరిష్కరిస్తుంది. ఇది ఆరోగ్యం మరియు రోగనిరోధక శక్తిని పెంపొందించే సాంకేతికతను అభివృద్ధి చేయడానికి మరియు ప్రోత్సహించడానికి ఒక కన్వర్జెంట్ పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ద్వారా దేశ నిర్మాణంపై దృష్టి పెడుతుంది. పోషకాహార నాణ్యతను పొందడం, గుర్తింపు పొందిన ల్యాబ్లలో పరీక్షలను నిరూపణ చేయడం, సర్వీస్ డెలివరీని సద్వినియోగం చేయడం మరియు సేవల సకాలంలో పర్యవేక్షణ మరియు సమర్థవంతమైన నిర్వహణను నిర్ధారించడానికి 'పోషన్ ట్రాకర్' ద్వారా సాంకేతికతను ఉపయోగించే ప్రయత్నాలు జరిగాయి.

# 900 ఔషధాల ధరల పెంపు

## ఫార్మా కంపెనీలకు ఎన్‌పీపీఏ అనుమతి

## జాబితాలో గుండె జబ్బులు, మధుమేహం

కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ పరిధిలోని 'జాతీయ ఔషధ ధరల సాధికారసంస్థ' (ఎన్‌పీపీఏ) 900కిపైగా ఔషధాల ధరల పెంపునకు అనుమతించింది. మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయంతో.. గుండె జబ్బులు, మధుమేహంతోపాటు పలు కీలక ఇన్‌ఫెక్షన్లకు చికిత్సను అందించే ఔషధాల ధరలు గరిష్ఠంగా 1.74 మేర పెరగనున్నాయి. ఈ వివరాల్ని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. ధరలు పెరగనున్న ఔషధాల జాబితాలో అజిత్రోమైసిన్, అమోక్సిసిలిన్, డైక్లోఫెనాక్, ఇబుప్రొఫెన్, డాపాగ్లిఫ్లోజిన్, మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్, గ్లిమ్‌పైరైడ్, అసిక్లోవిర్, హైడ్రాక్సీ క్లోరోక్విన్ మొదలైనవి ఉన్నాయి.

# మందుల ధరల పెరుగుదలపై సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు

సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమై పోయిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గ దర్శకాలను రూపొందించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకంగా మారిందని విమర్శించింది. ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో మందులు కొనుగోలు చేయిస్తున్నాయంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తమ ఫార్మసీల నుంచి మందులు కొనుగోలు చేయాలంటూ.. రోగులను బలవంతం చేయకుండా ప్రైవేట్

ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో రోగులు దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే పార్మసీలో స్వల్ప ధరకు లభ్యమవుతుంటే.. దానిని తమ పార్మసీలోనే కొనుగోలు చేయాలంటూ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులపై ఒత్తిడి తీసుకు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమై పోయిందంటూ వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గ దర్శకాలను రూపొందించాలంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే గతంలో ఇదే అంశంపై పలు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వాటికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, అరుణాచల్ ప్రదేశ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. ఆ క్రమంలో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధరల నియంత్రణపైనే తాము ఆధారపడతామని ఆయా రాష్ట్రాలు స్పష్టం చేశాయి. అత్యవసర మందులు అందుబాటు ధరల్లో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలు నిర్ణయించినట్లు తెలిపాయి. అయితే ఆసుపత్రిలోనే మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏమి లేదని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది.



# సాహసోపేతంగా భర్తను కాపాడుకున్న భార్య

## కేరళలోని పిరవోమ్ పట్టణంలో జరిగిన ఘటన

భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు అత్యంత సాహసోపేతంగా వ్యవహరించింది 56 ఏళ్ల భార్య. దాదాపు 40 అడుగుల లోతు బావిలో దిగి భర్తను మునిగిపోకుండా చూసింది. అనంతరం అగ్నిమాపక, సహాయక సిబ్బంది వారిద్దరిని బయటకు తీశారు. ఈ ఘటన కేరళలోని పిరవోమ్ పట్టణంలో జరిగింది. చెట్టు నుంచి మిరియాలను తెంపుతూ రమేశన్ (64) అనే వ్యక్తి 40 అడుగుల లోతైన బావిలోకి పడిపోయాడు. అది గమనించిన రమేశన్ భార్య పద్మం (56) వెంటనే అప్రమత్తం అయింది. భర్తను కాపాడుకునేందుకు నడుం బిగించి తన ప్రాణాలను పణంగా పెట్టి, ఒక తాడును పట్టుకుని చాకచక్యంగా బావిలోకి దిగింది. నీటిలో రమేశన్‌ను మునిగిపోకుండా ఆపింది. అగ్నిమాపక సిబ్బంది, సహాయక దళాలు వచ్చే వరకు(దాదాపు 20 నిమిషాలు) భర్త మునగకుండా లాగి పట్టుకొని, బావిలో అలాగే ధైర్యంగా నిలబడిపోయింది పద్మం. సహాయక దళాలు బావి నుంచి రమేశన్, పద్మం దంపతులను బయటకు తీస్తున్న దృశ్యాలను కేరళలోని న్యూస్ ఛానళ్లు ప్రసారం చేశాయి. దీంతో 56 ఏళ్ల పద్మం కనబర్చిన సాహసాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. సహాయక చర్యల గురించి ఒక అగ్నిమాపక విభాగం అధికారి పలు వివరాలు వెల్లడించారు. “ఈ ప్రమాదం జరిగిన బావి చాలా లోతుగా ఉంది. అందువల్ల మాకు పైనుంచి రమేశన్, పద్మం దంపతులు సరిగ్గా కనిపించలేదు. నీటిలో సగం మునిగి ఉన్న రమేశన్‌ను లిఫ్ట్ చేయడానికి మేము రెస్క్యూ నెట్‌ను బావిలోకి విసిరాం. రమేశన్‌ను నీటిలో నుంచి ఎత్తి, రెస్క్యూ నెట్‌లోకి వేసేందుకు మా టీమ్ నుంచి ఒకరు బావిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. అయితే సిబ్బంది అవసరం లేదని పద్మం చెప్పింది. తానే భర్తను నెట్‌లోకి ఎత్తుతానని చెప్పింది. చెప్పినట్టే ఆమె తన భర్తను ఎత్తి రెస్క్యూ నెట్‌లో వేసింది. ఆ తర్వాత ఆమె బావి నుంచి బయటకు వచ్చింది. తన భర్త ప్రాణాలను నిలుపుకోవాలనే ఆలోచనలో ఆమె ఇదంతా చేయగలిగింది. వారిద్దరికీ పెద్దగా గాయాలు కాలేదు. పద్మం భర్తను వెంటనే ఆస్పత్రికి తరలించాం” అని అగ్నిమాపక అధికారి వివరించారు.

# ఆత్మహత్యల నివారణకు ఐఐటీ గువాహటి మాస్టర్‌ప్లాన్!

## ఫ్యాకల్టీతో మార్నింగ్ వాక్, మానసిక కౌన్సెలింగ్

విద్యార్థుల ఆత్మహత్యల అంశాన్ని అసోంలోని ఐఐటీ గువాహటి సీరియస్‌గా తీసుకుంది. ఫ్రెషర్లకు కూల్‌కూల్‌గా స్వాగతం పలికే సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని ఐఐటీ గువాహటి డైరెక్టర్ దేవేంద్ర జలిహాల్ ప్రకటించారు. "ఫ్రెషర్ విద్యార్థులు ఇన్‌స్టిట్యూట్‌కు రాగానే, మొదటి వారంలో క్లాసులను మొదలుపెట్టం. కాలేజీ క్యాంపస్ వాతావరణానికి వారు అలవాటుపడే అవకాశాన్ని కల్పిస్తాం. తద్వారా వాళ్లు కాలేజీలో ఇమిడిపోతారు" అని ఆయన తెలిపారు. "మొదటి వారంలో కాలేజీ బోధనా సిబ్బందితో కలిసి ఫ్రెషర్లు మార్నింగ్ వాక్ చేస్తారు. దీనివల్ల వారు దగ్గరవుతారు. క్లాస్‌రూంలోకి అడుగు పెట్టక ముందే వారికి పరిచయాలు ఏర్పడతాయి. కొత్త విద్యార్థులందరికీ కౌన్సెలింగ్ చేస్తాం. వారి భయాలను, అపోహలను దూరం చేస్తాం. సమగ్ర వైద్య పరీక్షలు చేయిస్తాం. మానసిక ఒత్తిడిని అధిగమించే వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాం" అని ఐఐటీ గువాహటి డైరెక్టర్ తెలిపారు.

### వార్డెన్లుగా రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది

"ఫ్రెషర్లకు కౌన్సెలింగ్ చేసేందుకు సాథీ కౌన్సెలింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశాం. ఇందులో విద్యార్థులు వలంటీర్లుగా ఉంటారు. ప్రొఫెషనల్ కౌన్సిలర్లు వచ్చి విద్యార్థులకు కౌన్సెలింగ్ చేస్తారు" అని దేవేంద్ర జలిహాల్ పేర్కొన్నారు. "క్యాంపస్‌లో ఉన్న హాస్టల్‌కు వార్డెన్లుగా రిటైర్డ్ ఆర్మీ సిబ్బందిని నియమించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. వారు ఎప్పటికప్పుడు విద్యార్థులతో టచ్‌లో ఉంటారు. సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరిస్తారు. విద్యార్థుల భద్రత కోసం ఇదంతా బయటికి చెప్పకుండానే అమలు చేయిస్తాం. విద్యార్థుల ప్రైవసీకి భంగం కలగనివ్వం" అని ఆయన చెప్పారు. "పౌష్టికాహార నిపుణులను కూడా ఇన్‌స్టిట్యూట్‌లో నియమిస్తాం. వారు పోషకాహారం గురించి విద్యార్థులకు గైడెన్స్ ఇస్తారు. మానసిక ఒత్తిడి, ఆందోళన నుంచి బయటపడేలా వారికి సలహాలు అందిస్తారు" అని దేవేంద్ర జలిహాల్ పేర్కొన్నారు. "పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన వారిని కొత్త విద్యార్థులకు మెంటర్లుగా నియమిస్తాం. విద్యార్థులకు వీరు కెరీర్ గైడెన్స్ ఇస్తారు. సందేహాలను తీరుస్తారు. రాబోయే విద్యాసంవత్సరాల్లో అనుసరించాల్సిన ప్రణాళిక గురించి చెబుతారు" అని ఐఐటీ గువాహటి

విద్యార్థి వ్యవహారాల డీన్ పెరుమాళ్ అలగర్ సామి తెలిపారు. ఫ్రెషర్ల సమగ్ర వికాసం కోసం కౌన్సెలింగ్ విభాగంతో పాటు 'సెంటర్ ఫర్ హోలిస్టిక్ వెల్ బీంగ్' కలిసి పనిచేస్తాయన్నారు. గతేడాది సెప్టెంబరులో ఐఐటీ గువాహటిలో మూడో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థి (ఉత్తరప్రదేశ్) ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో క్యాంపస్‌లోని విద్యార్థులంతా నిరసనకు దిగారు. చనిపోయిన విద్యార్థికి న్యాయం చేయాలని కోరారు. ఇన్‌స్టిట్యూట్‌లోని విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకే ఇప్పుడు ఆ దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# కెనడా మంత్రివర్గంలో భారత సంతతి మహిళలు

కెనడా నూతన ప్రధాని మార్క్ కార్నీ మంత్రివర్గంలో ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు చోటు దక్కింది. వారిద్దరూ మహిళలు కావడం విశేషం. ఇండో-కెనడియన్ అనితా అనంద్ (58) ఆవిష్కరణలు, సైన్స్, పరిశ్రమల శాఖ మంత్రిగా నియమితులయ్యారు. ఢిల్లీలో జన్మించిన కమల్ ఖేరా (36) ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కెనడా పార్లమెంటుకు ఎన్నికయిన మహిళల్లో ఆమె అత్యంత పిన్న వయస్కురాలన్న గుర్తింపును ఇప్పటికే పొందారు. గత ప్రధాని జస్టిన్ ట్రూడో మంత్రివర్గంలోనూ వారిద్దరు పనిచేశారు. వేరే శాఖలను నిర్వహించారు. ప్రస్తుతం మంత్రి పదవులను మళ్లీ దక్కించుకున్న కొద్దిమందిలో వీరు ఉండడం విశేషం.

# ఏసర్ ఇండియాలో మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఎల్ అండ్ టీ, జొమాటో, స్విగ్గీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తదితర సంస్థల బాటలో ప్రముఖ టెక్ దిగ్గజం ఏసర్ ఇండియా ప్రయాణించనున్నది. తమ సంస్థలోని మహిళా ఉద్యోగులకు ప్రతి నెలలో ఒకరోజు వేతనంతో కూడిన నెలసరి సెలవు మంజూరు చేయనున్నట్లు ఏసర్ ఇండియా తెలిపింది. 'మాతృక' అనే పేరుతో నెలసరి సెలవు విధానాన్ని సంస్థలో ప్రవేశ పెట్టినట్లు పేర్కొంది. తద్వారా తాము ఉద్యోగుల సంక్షేమం, లింగ సమానత్వంపై ముందు చూపుతో ఆలోచిస్తామని వెల్లడించింది.

# మానవ అక్రమ రవాణాను ఛేదించిన ఎన్ఐఏ

## నిందితుల్లో ఎక్కువమంది బంగ్లాదేశీయులు

## హైదరాబాద్‌లో ఆస్తులు జప్తు చేసిన ఇడి

తెలంగాణ పోలీసులు నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా, మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 నిబంధనల ప్రకారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన దర్యాప్తును ప్రారంభించింది, తరువాత వాటిని హైదరాబాద్‌లోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) స్వీకరించింది. తెలంగాణ పోలీసులు హైదరాబాద్ శివార్లలోని రెండు వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించి, బంగ్లాదేశ్ జాతీయులు నిర్వహిస్తున్న వ్యవస్థీకృత వ్యభిచారం మరియు మానవ అక్రమ రవాణా సిండికేట్‌ను కనుగొన్నారు. ఈ దాడుల్లో ఛత్రినాక మరియు పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబడ్డాయి. ఎన్ఐఏ కనుగొన్న దాని ప్రకారం, అరెస్టయిన నిందితులలో ఎక్కువ మంది బంగ్లాదేశ్ జాతీయులు, వారు చెల్లుబాటు అయ్యే ప్రయాణ పత్రాలు లేకుండా భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించారు. వారు నకిలీ భారతీయ గుర్తింపు పత్రాలను సంపాదించారు మరియు ఇలాంటి కేసుల్లో గతంలో అరెస్టులు ఉన్నప్పటికీ, వ్యభిచారం మరియు అక్రమ రవాణాలో వారి ప్రమేయాన్ని కొనసాగించారు . బాధితులైన బంగ్లాదేశ్ బాలికలను ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దులో పనిచేసే ఏజెంట్లు భారతదేశంలోకి రప్పించారు, బ్యూటీ పార్లర్లు, దర్జీ దుకాణాలు, ఉక్కు కర్మాగారాలు మరియు గృహ కార్మికులుగా మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే, అక్కడికి చేరుకున్న తర్వాత, వారిని బలవంతంగా వ్యాపారంలోకి నెట్టారు. ప్రిడికేట్ ఏజెన్సీ దాఖలు చేసిన దర్యాప్తు మరియు ఛార్జిషీట్ తర్వాత ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు విధించింది. నిందితులు హైదరాబాద్ అంతటా వ్యభిచార గృహాలను నిర్వహిస్తున్నారని, బాధితులైన బాలికలను కమిషన్ ప్రాతిపదికన ఇతర వ్యభిచార గృహాలు మరియు ఏజెంట్లకు పంపుతున్నారని ఈడి దర్యాప్తులో తేలింది. నకిలీ గుర్తింపు పత్రాలను ఉపయోగించి, వారు తమ చట్టవిరుద్ధ

కార్యకలాపాలను సులభతరం చేయడానికి బహుళ బ్యాంకు ఖాతాలు మరియు ఆన్‌లైన్ వాలెట్లను తెరిచారు. అక్రమ రవాణాదారులు పశ్చిమ బెంగాల్‌లోని ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దులో ఏజెంట్లు మరియు మధ్యవర్తులకు ఒక్కొక్కరికి 4,000 నుంచి 5,000 చెల్లించారు, ఆ డబ్బును సరిహద్దుకు ఇరువైపులా అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో పాల్గొన్న వివిధ వ్యక్తుల మధ్య పంచుకున్నారు. అక్రమ రవాణాకు సంబంధించిన చెల్లింపులు బ్యాంకింగ్ మార్గాల ద్వారా అలాగే నగదు రూపంలో జరిగాయి. డబ్బు జాడను అస్పష్టం చేయడానికి, నిందితులు ఆర్థిక మధ్యవర్తులను మరియు డబ్బు బదిలీ సేవలను ఉపయోగించారు, లావాదేవీల కోసం మొబైల్ నంబర్‌లను మాత్రమే అందించారు. గుర్తించకుండా ఉండటానికి, వారు లావాదేవీలను నియంత్రణ పరిమితుల కంటే తక్కువ మొత్తంలో చిన్న మొత్తాలుగా రూపొందించారు. వచ్చే ఆదాయంలో గణనీయమైన భాగాన్ని బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని వ్యక్తులకు బదిలీ చేశారు, వారు డబ్బును నగదు రూపంలో ఉపసంహరించుకుని హవాలా ఏజెంట్లకు అందజేశారు. ఈ ఏజెంట్లు నిధులు నిందితుల కుటుంబాలకు మరియు బంగ్లాదేశ్‌లోని అక్రమ రవాణా బాధితులకు చేరేలా చూసుకున్నారు, తరచుగా బంగ్లాదేశ్ బ్యాంక్ యొక్క మొబైల్ ఆర్థిక సేవను ఉపయోగించారు. బంగ్లాదేశ్ బాలికలను భారతదేశానికి అక్రమంగా రవాణా చేయడంలో కీలక ఏజెంట్‌గా గుర్తించబడిన రుహుల్ అమీన్ ధాలీకి చెందిన డిజిటల్ వాలెట్లు, బ్యాంకు ఖాతాలు మరియు స్థిరాస్తిలో నిల్వలు ఈడి అటాచ్ చేసిన ఆస్తులలో ఉన్నాయి. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# పాలకుల నుంచి అధికారుల వరకూ అక్కడ అందరూ మహిళలే

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి రంగంలోనూ మహిళలు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. రాజకీయంగానూ రాణిస్తుండటమే గాక ప్రభుత్వ పాలనలోనూ తిరుగులేని నారీశక్తిగా నిలుస్తున్నారు. కానీ ఏదైనా ఒక ఊరిలో ఒకరో, ఇద్దరో మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఉంటారు కానీ కృష్ణా జిల్లా మోపిదేవి మండలంలో పనిచేసే

కీలక అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ మహిళలే ఉండటం విశేషం. గ్రామ సర్పంచి దగ్గర నుంచి ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్, మండల విస్తరణాధికారి, మండల వ్యవసాయ అధికారి, ప్రభుత్వ పాఠశాలల హెడ్‌మాస్టర్లతోపాటు రైతు సేవా కేంద్రం అధికారి, బ్యాంకు మేనేజర్లు ఇలా ప్రతి రంగంలోనూ అతివలు అడుగుపెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. మండలాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తున్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రజాసేవలో తమదైన ముద్ర వేస్తున్నారు మహిళా ఉద్యోగులు. దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న సమస్యలను సామాజిక సమస్యలను పారద్రోలారు. నాగాయతిప్పలో బహిరంగ మలవిసర్జనను వందశాతం అరికట్టడమేగా మహిళల ఆత్మగౌరవం పెంచేలా ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించుకునేలా ఎంపీడీఓ స్వర్ణభారతి ప్రోత్సహించారు.

అలాగే తరతరాలుగా యాచన చేస్తూ రోడ్లపక్కనే జీవిస్తున్న యానాదులకు ఇళ్లు కట్టించి ఇవ్వడమేగాక, రోడ్లు, విద్యుత్ తాగునీటి సౌకర్యం కల్పించడంలో మండల విస్తరణాధికారి త్రిపుర సుందరి ముందంజలో నిలిచారు. భవిష్యత్‌లో సమాజం నుంచి ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో విద్యార్థి దశలోనే శిక్షణ ఇస్తున్నట్లు జిల్లాపరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయంతి తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు మహిళలే ఉండటం విశేషం. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత మండలమైన మోపిదేవిలో వ్యవసాయ అధికారిణి, రైతుసేవా కేంద్రం అధికారిణి కూడా మహిళలే ఉండటం విశేషం. పంటలసాగులో రైతులకు మెలకువలు తెలియజేయడమేగాక, ప్రభుత్వం నుంచి అందే రాయితీలను వారికి వివరించి హితోదకంగా సాయం చేస్తున్నారు. అలాగే కేడీసీసీ బ్యాంకు మేనేజర్‌గా మహిళల ఆర్థిక ఎదుగుదలకు పొదుపు రుణాలు అందజేస్తున్నారు సల్మా సుల్తానా సయ్యద్. మహిళా రిజర్వేషన్‌తో ఎన్నికల్లో పోటీ చేసి గ్రామసర్పంచ్‌గా విజయం సాధించడమేగాక, ప్రజా సమస్యలకు చక్కటి పరిష్కారం చూపి రాజకీయంగానూ మహిళలకు ఎదురులేదని నిరూపించారు సర్పంచ్ నందిగం మేరిరాణి. ఎంపీపీగా మండలాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిస్తున్నది కూడా మహిళా నేతే కావడం విశేషం. పాలకుల దగ్గర నుంచి అధికారుల వరకు కీలకైన పదవుల్లో మహిళలే ఉండటమేగాక ఆయా రంగాల్లో మోపిదేవి మండలాన్ని అగ్రగామిగా నిలబెట్టడంలో అతివలు తమదైన ముద్ర వేశారు.


# - బాలికా విద్య -

# ఫలితాలు సాధించినా లక్ష్యానికి ఇంకా దూరమే

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముందు యునిసెఫ్, ప్లాన్ ఇంటర్నేషనల్ మరియు యుఎన్ ఉమెన్ ప్రారంభించిన 30 సంవత్సరాలకు పైగా కౌమార బాలికల హక్కులు-1995లో 189 ప్రభుత్వాలు బీజింగ్ ప్లాట్ఫాం ఫర్ యాక్షన్ ను ఆమోదించినప్పటి నుండి గత 30 సంవత్సరాలలో కౌమార బాలికల జీవితాలు ఎలా మారాయో సమీక్షించాయి. గత మూడు దశాబ్దాలుగా విద్య వంటి రంగాలలో గణనీయమైన విజయాలు సాధించినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది కౌమార బాలికలు ఇప్పటికీ పాఠశాలకు దూరంగా ఉన్నారు, భవిష్యత్తు కోసం సన్నద్ధం కాలేదు, ప్రాణాలను రక్షించే ఆరోగ్య సేవలలో అంతరాలను ఎదుర్కొంటున్నారు మరియు ప్రమాదానికి గురవుతున్నారు. బాల్య వివాహం, స్త్రీ జననేంద్రియ వైకల్యం, హింస మరియు దుర్వినియోగం వంటి హానికరమైన పద్ధతులు.

## విద్య, శిక్షణ మరియు డిజిటల్ నైపుణ్యాలు

గత 20 సంవత్సరాలలో పాఠశాలకు వెళ్లని బాలికల సంఖ్య 39 శాతం తగ్గినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా 122 మిలియన్ల మంది బాలికలు పాఠశాలకు దూరంగా ఉన్నారు. దక్షిణాసియాలో 15-19 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికలు పాఠశాల, ఉపాధి లేదా శిక్షణలో లేని అబ్బాయిల కంటే మూడు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా 10 మంది కౌమార బాలికలు మరియు యువతులలో దాదాపు 4 మంది ఉన్నత మాధ్యమిక పాఠశాల పూర్తి చేయరు, గ్రామీణ పేద నేపథ్యాలు మరియు అట్టడుగు వర్గాలకు చెందిన బాలికలు పాఠశాల విద్యను పూర్తి చేసే అవకాశం కూడా తక్కువ. గత మూడు దశాబ్దాల్లో నిరక్షరాస్యులైన కౌమార బాలికలు మరియు యువతుల సంఖ్య దాదాపు సగానికి తగ్గినప్పటికీ, నేడు దాదాపు 50 మిలియన్ల కౌమార బాలికలు మరియు యువతులు ఒక




# ఆడపిల్ల చదువు.. ఇంటికే వెలుగు

సాధారణ వాక్యాన్ని చదవడం లేదా వ్రాయలేకపోతున్నారు. తక్కువ ఆదాయ దేశాలలో 10 మంది కౌమార బాలికలు మరియు యువతులలో 9 మందికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు, అయితే వారి పురుష సహచరులు ఆన్లైన్లో ఉండే అవకాశం రెండు రెట్లు ఎక్కువ.

## లింగ ఆధారిత హింస

వివాహం చేసుకున్న లేదా భాగస్వామి అయిన నలుగురిలో కౌమార బాలికలలో దాదాపు ఒకరు ప్రపంచవ్యాప్తంగా సన్నిహిత భాగస్వామి హింసను ఎదుర్కొన్నారు, మరియు నేడు సజీవంగా ఉన్న 50 మిలియన్ల మంది బాలికలు లైంగిక హింసను ఎదుర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 15-19 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికలు మరియు అబ్బాయిలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది కొన్ని పరిస్థితులలో తన భార్యను కొట్టడంలో భర్త సమర్థించబడ్డారని భావిస్తారు.

## హానికరమైన పద్ధతులు

స్త్రీ జననేంద్రియ వైకల్యం యొక్క అభ్యాసం తగ్గుతోంది, బుర్కినా ఫాసో మరియు లైబీరియాతో సహా దేశాలు గత 30 సంవత్సరాలుగా ఈ అభ్యాసానికి గురైన బాలికల వాటాను సగానికి తగ్గించాయి. ఏదేమైనా, 2030 నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రపంచ క్షీణత రేటు 27 రెట్లు వేగంగా ఉండాలి. 25 సంవత్సరాల క్రితంతో పోలిస్తే నేడు

బాలికలు 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సులో వివాహం చేసుకునే అవకాశం తక్కువ. అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఐదుగురు అమ్మాయిలలో ఒకరు బాల్యంలోనే వివాహం చేసుకుంటారు. దక్షిణ ఆసియాలో అత్యధిక పురోగతి సాధించగా, లాటిన్ అమెరికా మరియు కరేబియన్ గత 25 సంవత్సరాలుగా ఎటువంటి పురోగతిని గమనించలేదు.

## ఆరోగ్యం మరియు సంక్షేమం

ప్రపంచవ్యాప్తంగా, గత 30 సంవత్సరాల్లో ప్రసవించే కౌమార బాలికల సంఖ్య దాదాపు సగానికి తగ్గింది. అయినప్పటికీ, 15-19 సంవత్సరాల వయస్సు గల దాదాపు 12 మిలియన్ల కౌమార బాలికలు 2025 లో జన్మనిస్తారని భావిస్తున్నారు. యువ కౌమార బాలికలలో (10-14 సంవత్సరాల వయస్సు) వీరిలో గర్భం యొక్క ప్రమాదం మరింత తీవ్రంగా ఉంటుంది, ఈ సంఖ్య 325,000 కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా.

ప్రపంచవ్యాప్తంగా 15-19 సంవత్సరాల వయస్సు గల కౌమార బాలికలలో ప్రతి 23 మరణాలలో గర్భం మరియు ప్రసవ సమస్యల నుండి సుమారు 1 శాతం మంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా, 10-19 సంవత్సరాల వయస్సు గల తక్కువ బరువు గల కౌమార బాలికల నిష్పత్తి గత మూడు దశాబ్దాలలో 10 శాతం నుండి 8 శాతానికి కొద్దిగా తగ్గింది. కౌమార బాలికల అపారమైన సామర్థ్యాన్ని అన్లాక్ చేయడానికి ప్రపంచ చర్య యొక్క అత్యవసర అవసరాన్ని ఈ నివేదిక నొక్కి చెబుతుంది మరియు ఈ క్రింది సిఫార్సులను ముందుకు తెస్తుంది.

కౌమార బాలికల స్వరాలను పెంచడం మరియు వారి జీవితాలను ప్రభావితం చేసే సమస్యలపై విధాన రూపకల్పనకు వారి న్యాయవాదానికి మద్దతు ఇవ్వడం.

కొత్త ప్రపంచ పోకడలు మరియు వైఖరిని పరిగణనలోకి తీసుకుంటూ, పురోగతి నిలిచిపోయిన మరియు కౌమార బాలికలకు ప్రధాన ప్రాధాన్యత ఉన్న రంగాలపై దృష్టి పెట్టడం-ఉదాహరణకు బాలికల విద్య, నైపుణ్యాలు మరియు శిక్షణ అంతరాన్ని మూసివేయడం.

ఆర్థిక సాధికారతపై ఎక్కువ దృష్టి పెట్టడం మరియు బాలికలు అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలు, ఆస్తులు మరియు వనరులను కలిగి ఉండేలా చూడటం ద్వారా,

పెద్ద ఎత్తున మార్పులు మరియు ఉమ్మడి లక్ష్య చర్యలపై దృష్టి సారించి, కౌమార బాలికలకు అంతరాలు ఎక్కువగా ఉన్న చోట పెట్టుబడి పెట్టడానికి డేటా ఆధారిత సాక్ష్యాలను ఉపయోగించడం.

"కౌమారదశలో ఉన్న బాలికలు ప్రపంచ మార్పుకు శక్తివంతమైన శక్తి. సరైన సమయంలో సరైన మద్దతుతో, అవి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అందించడంలో మరియు మన ప్రపంచాన్ని పునర్నిర్మించడంలో సహాయపడతాయి "అని యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరీన్ రస్సెల్ అన్నారు. "విద్య, నైపుణ్యాలు, రక్షణ మరియు అవసరమైన ఆరోగ్య మరియు పోషకాహార సేవలు వంటి క్లిష్టమైన రంగాలలో పెట్టుబడులు ప్రపంచవ్యాప్తంగా కౌమార బాలికల సామర్థ్యాన్ని అన్లాక్ చేయగలవు మరియు కమ్యూనిటీలు మరియు దేశాలను పెంచుతాయి".

ప్లాన్ ఇంటర్నేషనల్ యొక్క చీఫ్ స్ట్రాటజీ అండ్ ఎంగేజ్మెంట్ ఆఫీసర్ కాత్లీన్ షెర్విన్ ఇలా అన్నారుః "లింగ అసమానతను ఎదుర్కోవటానికి అవిశ్రాంత ప్రయత్నాలు అంటే ఒక అమ్మాయి పాఠశాలకు వెళ్లే అవకాశాలు మూడు దశాబ్దాల క్రితం కంటే గణనీయంగా ఎక్కువగా ఉన్నాయి, మరియు ఆమె చిన్నతనంలో వివాహం చేసుకునే లేదా గర్భవతి అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. జరుపుకోవడానికి చాలా ఉంది-కానీ అదే సమయంలో, ఈ పురోగతి పెలుసుగా, అసమానంగా మరియు నిరంతరం ముప్పుగా ఉంది. చాలా మంది బాలికలు ప్రతిరోజూ వివక్ష మరియు దుర్వినియోగాన్ని ఎదుర్కొంటున్నారు, కేవలం యువత మరియు స్త్రీ అయినందుకు. బాలికలకు సమానత్వం సాధించడానికి మన కృషి కొనసాగాలి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలికలు, మహిళలు మరియు వారి మిత్రులతో కలిసి పనిచేయాలి "అని అన్నారు. "చాలా మంది కౌమార బాలికలు ఇప్పటికీ హింస, పరిమిత విద్య మరియు ఆరోగ్య సేవల కొరతను ఎదుర్కొంటున్నారు. ఎవరినీ వదిలిపెట్టబోమని మా వాగ్దానం తక్షణ చర్యను కోరుతుంది "అని యుఎన్ ఉమెన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిమా బాహౌస్ అన్నారు."మనం చాలా దూరం వచ్చాం, కానీ ప్రతి అమ్మాయి సామర్థ్యాన్ని గుర్తించి, రక్షించడానికి మనం చాలా మైళ్ళు వెళ్ళాలి.కౌమారదశలో ఉన్న బాలికలందరికీ సాధికారత కల్పించడం అనేది మరింత స్థిరమైన, సమానమైన మరియు శాంతియుత ప్రపంచంలో ఖచ్చితంగా పెట్టుబడి "అని అన్నారు.

# లంచం ఇస్తేనే నీరు.. ఆహారం


## జైలు కష్టాలను ఏకరవు పెట్టిన భారత బిలియనీర్ కుమార్తె

### గత ఏడాది అక్టోబరు 1న ఉగాండాలో నిర్బంధం
### 21 రోజుల పాటు నరకం చూసిన వసుంధర
### బెయిల్ వచ్చినా విడుదల చేయని అధికారులు

భారత సంతతికి చెరిన బిలియనీర్ కుమార్తె గతేడాది ఉగాండాలో అరెస్టయ్యారు. తమ వద్ద పనిచేసే రాజస్థాన్‌కు చెందిన ముకేశ్ మేనరియాను కిడ్నాప్ చేశారనేది ప్రధాన ఆరోపణ. ఓస్వాల్ కుటుంబానికి చెందిన ప్రైవేటు జెట్‌కు క్యాబిన్ సిబ్బందిగా పనిచేసిన అతడు.. తర్వాత వివిధ ప్రాంతాల్లోని వారి ఆస్తులు, వ్యాపార బాధ్యతలను అప్పగించారు. కానీ, ఆ కుటుంబంతో అతడికి చెడింది. దీంతో ముకేశ్‌ను కిడ్నాప్ చేసి, చంపేందుకు ప్రయత్నించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలతోనే వసుంధరను అరెస్ట్ చేశారు.

ఉగాండాలో హత్య, కిడ్నాప్ ఆరోపణలతో నిర్బంధానికి గురై విడుదలైన భారత సంతతికి చెందిన బిలియనీర్ పంకజ్ ఓస్వాల్ కుమార్తె వసుంధర ఓస్వాల్  జైలు అనుభవం గురించి వెల్లడించారు. ఆ భయానక అనుభవాన్ని గుర్తుచేసుకున్న వసుంధర.. అత్యంత దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొన్నట్టు పేర్కొంది. ఎలాంటి వారెంట్ లెకుండా నిర్బంధించారని వాపోయిన ఆమె.. ఒకానొక దశలో వాష్‌రూమ్ కూడా వెళ్లడానికి అనుమతించలేదని తెలిపారు. బలవంతంగా తనను ఓ పోలీస్ అధికారి లాక్కెళ్లి వ్యానులోకి పడేశాడని వసుంధర వాపోయారు. తమ ఇంటిలో పనిచేసే ముకేశ్ అనే వ్యక్తి అదృశ్యమవ్వడంతో గతేడాది అక్టోబరు 1న ఉగాండా పోలీసులు వసుంధర ఓస్వాల్‌ను కిడ్నాప్, హత్య ఆరోపణల కింద అరెస్ట్ చేశారు. అదృశ్యమైన వ్యక్తి టాంజానియాలో కనిపించినా.. న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా.... తనను విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేశారని వసుంధర పేర్కొన్నారు. “అక్టోబరు 1న ఎలాంటి వారెంట్ లేకుండా పోలీసులు మా ఇంట్లోకి ప్రవేశించారు.. ప్రశ్నిస్తే ఇది ఐరోపా కాదు.. ఉగాండా అని సమాధానం ఇచ్చారు. ఇంటర్‌పోల్ అధికారిని కలవాలంటూ బలవంతంగా ఓ పోలీసు అధికారి లాక్కెళ్లి వ్యాన్‌లో వేశాడు... పాస్‌పోర్టు తీసుకున్నారు. పోలీస్ బాండ్ కోసం 30 వేల

డాలర్లు కట్టాలని చెప్పారు.. ఆ మొత్తాన్ని చెల్లించినా నాకు ఎలాంటి బాండ్ ఇవ్వలేదు.. మూడు రోజులు నిర్బంధం అనంతరం నకసోంగోలా జైలుకు తరలించారు. రెండు వారాలకుపైగా అక్కడ నరకం చూపించారు.. నా ప్రాథమిక హక్కులకు తీవ్రంగా భంగం కలిగించారు.. నీళ్లు, భోజనం ఇవ్వలేదు. స్నానం చేయనివ్వలేదు. కనీసం నన్ను వాష్‌రూమ్‌కు కూడా వెళ్లనివ్వలేదు.. లంచం ఇచ్చాకే ఆహారం, నీరు ఇచ్చేవారు." అని వసుంధర తెలిపారు. తనపై నమోదు చేసిన కేసును డిసెంబరు 21న కోర్టు కొట్టివేసిందని తెలిపారు. ఉగాండాలో తమ కుటుంబానికి చెందిన వ్యాపార సంస్థల కార్యకలాపాలను పరిశీలించేందుకు వెళ్లిన వసుంధరను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పట్లో ఆమె సోదరి రిధి ఓస్వాల్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది. కిడ్నాప్, హత్య అభియోగాల పేరుతో తమ సోదరిని అక్రమంగా నిర్బంధించారని, అత్యంత దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని రిధి ఆవేదన వ్యక్తం చేశారు. చెప్పులతో నిండిపోయిన ఒక గదిలో 90 గంటల పాటు బలవంతంగా ఉంచారని, ఐదురోజుల పాటు స్నానానికి, దుస్తులు మార్చుకోవడానికి కూడా అనుమతించలేదని ఇన్‌స్టాగ్రామ్ పోస్టు చేశారు. గతంలో ఓస్వాల్ కుటుంబం వద్ద పనిచేసిన రాజస్థాన్‌కు చెందిన ముకేశ్ మేనరియా అనే మాజీ ఉద్యోగి కారణంగానే ఆమెకు ఈ పరిస్థితి దాపురించింది.



# Form - IV

## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)